నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
ఆదిలాబాద్
శనివారం | ఫిబ్రవరి 08, 2025 | www.navatelangana.com

బస్టాండ్ కోసం స్థలం కేటాయించాలని తహసీల్దార్‌కు వినతి

నవతెలంగాణ-దహెగాం

మండల కేంద్రంలో ప్రయాణికుల సౌకర్యార్థం బస్టాండ్ నిర్మాణం కోసం స్థలం కేటాయించాలని కోరుతూ మండల యువకులు శుక్రవారం తహసీల్దార్ కవితకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల కేంద్రంలో బస్టాండ్ లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. బస్టాండ్ నిర్మాణమైతే ప్రయాణికుల ఇబ్బందులు దూరమవుతాయని తెలిపారు.



మహిళా ఎస్ఐ జ్యోతికి నగదు పురస్కారం

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

పోలీస్ అమరవీరుల దినోత్సవం అక్టోబర్-21ని పురస్కరించుకొని రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో జిల్లా నుండి పాల్గొని ద్వితీయ స్థానంలో నిలిచిన మహిళా ఎస్ఐ డి.జ్యోతిమణిని శుక్రవారం ఎస్పీ జి.జానకి షర్మిల ప్రత్యేకంగా అభినందించి బహుమతిగా రూ.15000వేల నగదు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి వ్యాస రచన పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లాకు పేరు తీసుకురావడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో డీపీఓ ఏఓ యూనస్ అలీ, ఆర్ఐ రమేష్, రామకృష్ణ, సూపరింటెండెంట్ శ్రీనివాస్, ఆర్ఎస్ఐ రవికుమార్ పాల్గొన్నారు.



ప్రజలెవరూ ఆందోళన చెందొద్దు

నవతెలంగాణ-జన్నారం



కవ్వాల్ టైగర్ జోన్ పరిధిలోని అటవీ శాఖ చెక్ పోస్టుల వద్ద రాత్రి తొమ్మిది గంటల నుంచి ఉదయం ఆరు గంటల వరకు వాహనాల రాకపోకలను నిషేధిస్తూ విధించిన ఆంక్షలను శుక్రవారం ఎత్తి వేశారని, ఇకపై చెక్‌పోస్టుల వద్ద అటవీ శాఖ వేధింపులు ఉండవని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ తెలిపారు. ప్రజలెవరూ ఆందోళన చెంద వద్దని పేర్కొన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే రాష్ట్ర ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ దోబ్రియాల్‌ను కలిసి అటవీ శాఖ అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. రాత్రి వేళల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరిస్తు వినతి పత్రాన్ని అందజేశారు. నేటి నుంచి చెక్‌పోస్టుల వద్ద నుంచి ఒక్క ఫిర్యాదు కూడా రాకూడదని ఎమ్మెల్యే పీసీసీఎఫ్‌కు సూచించారు. చెక్‌పోస్టుల వద్ద ఎలాంటి వేధింపులు ఉండవని, స్థానికులు తమ ఆధారాలు చూపి రాకపోకలు సాగించవచ్చని తెలిపారు. వారిని అడ్డుకోకుండా అధికారులకు తక్షణ ఆదేశాలు జారీ చేస్తున్నట్లు పీసీసీఎఫ్ హామీ ఇచ్చారన్నారు.

విద్యారంగ సమస్యలపై నిరంతర పోరాటం



నవతెలంగాణ-కెరమెరి

విద్యారంగ, సామాజిక సమస్యలపై ఎస్ఎఫ్ఐ నిరంతర పోరాటం చేస్తుందని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సతీష్ కుమార్ అన్నారు. శుక్రవారం ఎస్సై గుంపుల విజయ్ కుమార్ చేతుల మీదుగా పదో తరగతి టాలెంట్ టెస్ట్‌కు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 16న జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాలలో పదో తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ నిర్వహించనున్నట్లు తెలిపారు. దేశ సమైక్యత, సమగ్రత కోసం ఎస్ఎఫ్ఐ కృషి చేస్తుందన్నారు. విద్యా రంగంలో ప్రజాతంత్ర, లౌకిక భావాల వ్యాప్తికి, విద్యా పరిరక్షణకు విద్యార్థులను సన్నద్ధం చేసేందుకు నిరంతరం కృషి చేస్తుందన్నారు. విద్యార్థులు చదువుల్లో రాణించాలని, పోటీ ప్రపంచంలో అగ్ర భాగాన నిలబడాలని ఎస్ఎఫ్ఐ కోరుకుంతుందని పేర్కొన్నారు. త్వరలో జరగనున్న పబ్లిక్ పరీక్షలకు టెస్ట్ విద్యార్థులను సిద్ధం చేసేందుకు ప్రొఫెసర్ నాగేశ్వర్ పర్యవేక్షణలో పదవ తరగతి టాలెంట్ టెస్ట్ ప్రశ్నపత్రం రూపొందించడం జరిగిందని తెలిపారు. టాలెంట్ టెస్ట్‌కు సంబంధించిన ప్రశ్న పత్రం మల్టిపుల్ ఛాయిస్, తెలుగు, ఇంగ్లీష్ మీడియంలో ఉంటుందని తెలిపారు. విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పేర్కొన్నారు. కరపత్రాల ఆవిష్కరణలో ఏఎస్ఐ ఉల్లాస్, జిల్లా కమిటీ సభ్యులు, భీంరావు, మండల కార్యదర్శి కరణ్, పద్మావతి పాల్గొన్నారు.

ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌తో అగ్ని ప్రమాదాల నివారణ సులభం

నవతెలంగాణ-జన్నారం



అడవుల్లో అగ్ని ప్రమాదాలను ముందస్తుగా గుర్తించేందుకు ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ఉపయోగపడుతుందని పర్యావరణవేత్తలు అన్నారు. అడవులలో అగ్ని ప్రమాదాల నివారణకు ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ఏఐ వినియోగం, దానిపై అవగాహన కల్పించేందుకు శుక్రవారం మండల కేంద్రంలోని ఫారెస్ట్ టిడిసిలో అటవీశాఖ అధికారులకు, సిబ్బందికి అవగాహన కల్పించారు. అభయారణ్యంలోని అటవీ ప్రాంతాలలో ఏఐ ఉపయోగించి ముందుగానే అగ్ని ప్రమాదాలను గుర్తించి అరికట్టొచ్చని వివరించారు. వేసవి సమీపిస్తున్న తరుణంలో అడవులలో జరిగే అగ్ని ప్రమాదాలు నివారించుకోవడానికి, అలాగే అగ్ని ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవడానికి ఈ శిక్షణ అటవీశాఖ అధికారులకు ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. అనంతరం అడవుల్లోకి తీసుకెళ్లి అగ్ని ప్రమాదాల నివారణపై ప్రాక్టికల్‌గా చేసి చూపించారు. కార్యక్రమంలో ఎఫ్‌డీపీటీ శాంతారామ్, డిఎఫ్ఓ శివ ఆసిస్‌సింగ్, తాళ్లపేట ఎఫ్ఆర్ఓ సుష్మారావు, ఇందన్‌పల్లి ఎఫ్ఆర్ఓ కారం శ్రీనివాస్, శిక్షకులు బెంగళూరు వైల్డ్ లైఫ్ స్టడీ సెంటర్ అధికారి నరేంద్రన్ కోదండపాణి, ఎఫ్ఎస్ఓలు, ఎఫ్‌బీఓలు పాల్గొన్నారు.

లైబ్రరీని సందర్శించిన కామర్స్ విద్యార్థులు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాల విద్యార్థులు శుక్రవారం జిల్లా గ్రంథాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు తెలుగు, హిందీ, ఇంగ్లీష్, ఉర్దూ తదితర భాషలకు చెందిన పుస్తకాలను, జీవిత చరిత్రలు, స్వీయ చరిత్రలు, దేశ నాయకుల చరిత్రల పుస్తకాలను చూపించారు. పుస్తకాలు చదివితే జ్ఞానం వస్తుందని, ప్రతినిత్యం పుస్తకాలు చదువుతు ఉండాలని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అతిక్ బేగం అన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ రఘు గణపతి, తెలుగు విభాగం అధ్యాపకులు కె.రేఖ, నరేష్, ఇంగ్లీష్ విభాగం అధ్యాపకులు, అనిత, సంతోషిని, హిందీ విభాగం అధ్యాపకులు పూనం, జిల్లా గ్రంథాలయ అధికారులు సతీష్, కిరణ్ పాల్గొన్నారు.

జన్మదిన వేళ సేవా కార్యక్రమాలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



పట్టణంలోని కేఆర్కే కాలనీ వృద్ధాశ్రమంలో ప్రముఖ వ్యాపారవేత్త, సామాజిక కార్యకర్త మస్కరి పోతన్న జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా వృద్ధాశ్రమంలో కేక్ కట్ చేసి వృద్ధులకు స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. వృద్ధులతో కలిసి జన్మదిన వేడుకలు జరుపుకోవడం చాలా సంతోషాన్నిచ్చిందన్నారు. అంతకు ముందు రిమ్స్ ఆవరణలో పేదలకు అన్నదానం చేశారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతానని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్మైల్ సొసైటీ సభ్యులు భూరె సురేష్, రవికాంత్ యాదవ్, గుర్నూరె రామకృష్ణ, బాలు పాల్గొన్నారు.

రిజర్వేషన్‌పైనే ఉత్కంఠ..!

- ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఆశావహులు
- ప్రారంభమైన స్థానిక ఎన్నికల కసరత్తు
- ఇటు అధికారులు..అటు రాజకీయ పార్టీల హడావుడి
- ఈ నెలలోనే నోటిఫికేషన్ జారీకి అవకాశం

అందరి చూపు రిజర్వేషన్లపైనే ఉంది. ఎవరికి వస్తుందోనని తీవ్ర ఉత్కంఠ నెలకొంది. గ్రామాల్లో ప్రస్తుతం ఈ అంశంపై ప్రధాన చర్చకు దారితీస్తోంది. బీసీలకా..ఎస్సీలకా..జనరల్ వస్తుందా అని చర్చలు జరుగుతున్నాయి. ప్రస్తుతం ఏ నలుగురు కలిసినా ఇదే ప్రధాన ఏజెండాగా సాగుతుండటం ప్రాధాన్యం సంతరించుకుంది. రాజకీయ పార్టీలతో పాటు అనేక మంది స్వతంత్రంగా బరిలో నిలిచేందుకు సిద్ధమవుతున్నారు. రిజర్వేషన్ కలిసి వస్తే తమకు లేదంటే.. తమకు అనుకూలంగా ఉన్న వారిని ఎన్నికల్లో పోటీకి సిద్ధం చేస్తుండటం ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రభుత్వం, ఎన్నికల సంఘం సైతం ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉండటంతో అధికారులు సైతం ముందస్తుగా సిద్ధమవుతున్నారు. ఏ క్షణంలో నోటిఫికేషన్ విడుదలైనా సిద్ధంగా ఉండాలనే ఉద్దేశంతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా నాలుగు జిల్లాలోనూ అధికారులు బిజీబిజీగా ఉంటున్నారు. సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి అధికారిక పనులను పూర్తిచేయడంలో దృష్టిసారించారు.



జిల్లాకు చేరిన ఎన్నికల సామాగ్రి


సామాగ్రిని భద్రపరుస్తున్న సిబ్బంది

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ప్రభుత్వం స్థానిక ఎన్నికల పోరుకు సిద్ధమవుతోంది. మరికొన్ని రోజుల్లోనే నోటిఫికేషన్ జారీ అయ్యే అవకాశం కనిపిస్తోంది. ఇప్పటికే సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆశావహులు అన్ని రకాలుగా సిద్ధమవుతున్నారు. ముఖ్యంగా రాజకీయ పార్టీలు అభ్యర్థులను నిలబెట్టి ఎక్కువ సీట్లను గెలుచుకునేందుకు సిద్ధమవుతున్నాయి. అధికార కాంగ్రెస్‌తో పాటు బీఆర్ఎస్, బీజేపీ, ఇతర పార్టీలు సైతం ఎన్నికల బరిలో నిలిచేందుకు అస్త్రశస్త్రాలను సిద్ధం చేస్తున్నాయి. అనేక మంది ఆశావహులు ఆయా పార్టీల తరపున పోటీ చేసేందుకు సిద్ధమవుతుండటం ఆసక్తి రేపుతోంది. ముఖ్యంగా పోటీ అంశం రిజర్వేషన్లపై ఆధారపడి ఉండటంతో వాటి కోసం ఆతృతగా ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే ప్రభుత్వం బీసీ కుల గణనకు ఆమోదం తెలిపిన దృష్ట్యా ఇక అందరి దృష్టి బీసీ రిజర్వేషన్లు ఎంత శాతం కేటాయిస్తుంది..ఇందులో ఏయే గ్రామాలకు వర్తిస్తుందనేదానిపైనే అందరి దృష్టి కేంద్రీకృతమవుతోంది. గ్రామాల్లో ఎవరికి రిజర్వేషన్ వస్తుందోనని తీవ్ర స్థాయిలో ఉత్కంఠ నెలకొంది. పోటీ చేసేందుకు గ్రూపుల వారీగా జతకడుతూ ప్రణాళికలు వేసుకుంటున్నారు. గ్రామస్తులను మచ్చిక చేసుకుంటూ ఓట్లు రాబట్టుకోవడానికి ప్రయత్నాలు ప్రారంభించడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఆదిలాబాద్ జిల్లాలో 253 పంచాయతీలు ఉండగా.. మంచిర్యాలలో 311, నిర్మల్‌లో 398, కుమురంభీం ఆసిఫాబాద్‌లో 335 పంచాయతీలున్నాయి. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఇది వరకు 70 మండలాలు ఉండగా ఇటీవల మూడు మండలాలు పెరగడంతో ఈ సంఖ్య 73కి చేరింది. దీంతో 70చొప్పున ఎంపీపీ, జడ్పీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుంది.

అధికారులు సైతం బిజీబిజీ

ఎన్నికల సంఘం ఎప్పుడైనా నోటిఫికేషన్ జారీ చేసే అవకాశం ఉండటంతో సిద్ధంగా ఉండాలని అధికార యంత్రాంగం భావిస్తోంది. పంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి అధికారిక పనులను సిద్ధం చేస్తోంది. బ్యాలెట్ పత్రాల ముద్రణ, ఆర్ఓ, ఏఆర్ఓ, ప్రిసైడింగ్ అధికారుల నియామకం పూర్తిచేయగా.. శిక్షణలు ఇవ్వాల్సి ఉంది. పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేసుకోవాల్సి ఉంది. మరోపక్క బ్యాలెట్ బాక్సులతో పాటు ఎన్నికలకు నిర్వహణకు అవసరమైన ముద్రణ పుస్తకాలు, పత్రాలు కార్యాలయాలకు చేరుకుంటున్నాయి. ఈ నెల 12న హైదరాబాదులో జిల్లా కలెక్టర్ల సదస్సు ఉంటుంది. ఈ సదస్సు తర్వాత ఎన్నికలకు సంబంధించి పూర్తి స్పష్టత వచ్చే అవకాశం కనిపిస్తోంది. ముందుగా సర్పంచ్ ఎన్నికలు నిర్వహిస్తారా.. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు నిర్వహిస్తారా అనేది స్పష్టం కానుంది. ఈ నెలాఖరులోగా నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

అట్టహాసంగా ముగిసిన కబడ్డీ పోటీలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

క్రికెట్ తర్వాత కబడ్డీని ప్రజలు ఆదరిస్తున్నారని, క్రీడాకారులను ప్రోత్సహించి అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా ప్రోత్సహిస్తామని కబడ్డీ సంఘం అంతర్జాతీయ డైరెక్టర్ జగదీష్ యాదవ్ అన్నారు. పట్టణంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో నాలుగు రోజులుగా కొనసాగుతున్న సీనియర్ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు శుక్రవారం ముగిశాయి. ఫైనల్ మ్యాచ్ సూర్యాపేట, నల్గొండ మధ్య జరిగింది. హోరాహోరీగా జరిగిన మ్యాచ్‌లో నల్గొండ 36 పాయింట్లు చేయగా, సూర్యాపేట 39 పాయింట్లు సాధించి గెలిచింది. అనంతరం గెలుపొందిన జట్లకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా జగదీష్ యాదవ్ మాట్లాడుతూ ఒక సమయంలో క్రికెట్‌కు అత్యంత ఆదరణ ఉండేదన్నారు. నేడు గ్రామీణ క్రీడ అయిన కబడ్డీకి ఆదరణ రావడం సంతోషకరమైన విషయమన్నారు. ఇటీవల జరిగిన ఏషియా పోటీల్లో దేశానికి తొలి బంగారు పతకం కబడ్డీ జట్టు అందించిందన్నారు. వెనుకబడిన ప్రాంతమైన ఆదిలాబాద్ లాంటి జిల్లాలో రాష్ట్ర స్థాయిలో పోటీల నిర్వహణ బ్రహ్మాండంగా నిర్వహించారన్నారు. ఈ పోటీల నిర్వహణ, వారిలోని పట్టుదల చూస్తుంటే జాతీయ పోటీలను కూడా అవలీలగా నిర్వహిస్తారనే నమ్మకం వస్తుందన్నారు. ఆదిలాబాద్‌లో ఉన్న ప్రకృతి అందాలతో పాటు ఇక్కడి క్రీడాకారులు, సంఘం నాయకుల్లో కష్టపడే తత్వం ఉందన్నారు. కబడ్డీలో క్రీడాకారులను ప్రోత్సహిస్తు జాతీయ స్థాయిలో ఆడేలా కృషి చేస్తామన్నారు.

విజయంతంగా పోటీలు

సంఘం సభ్యుల సహకారంతో రాష్ట్రస్థాయి పోటీలను విజయవంతంగా నిర్వహించామని కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఉష్కం రఘుపతి అన్నారు. నాలుగు రోజుల పాటు 33 జిల్లాల నుంచి క్రీడాకారులకు వసతితో పాటు ఇతర సౌకర్యాలు కల్పించామన్నారు. ఈ వేడుక విజయవంతానికి సంఘం ప్రధాన కార్యదర్శి రాష్ట్రపాల్ కృషి ఎంతో ఉందన్నారు. జాతీయ స్థాయి పోటీలను నిర్వహించే ధైర్యం వచ్చిందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి మహేందర్‌రెడ్డి, ఇండియన్ కబడ్డీ కోచ్ శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర కోశాధికారి రవి కుమార్, జిల్లా అధ్యక్షుడు రఘుపతి, రాష్ట్రపాల్ పాల్గొన్నారు.





పంచాయతీల్లో వందశాతం ఇంటి పన్ను వసూలు చేయాలి

- వేసవిలో తాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలి
- నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్



నిర్మల్ : పంచాయతీలో వందశాతం ఇంటి పన్ను వసూలు చేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గ్రామీణ ప్రాంతాల్లో వేసవిలో తాగు నీటి సమస్యలు తలెత్తకుండా తీసుకోవాల్సిన చర్యలు, ఇంటి పన్ను వసూలు, వన మహోత్సవం తదితర అంశాలపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌తో కలిసి సంబంధిత అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. పంచాయతీలో ఇంటి పన్ను వసూలును త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. రానున్న వేసవికాలంలో ప్రజలకు తాగునీటికి ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. సంబంధిత అధికారులు ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకొని నీటి సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో తాగునీటి సరఫరాపై ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, చేతి పంపులు, బోరు బావుల పనితీరును పర్యవేక్షించి, అవసరమైన చోట మరమ్మతులు చేపట్టాలన్నారు. అవసరమైతే ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేయాలన్నారు. తీవ్రమైన నీటి ఒత్తిడి గల మండలాలను గుర్తించి ఆయా మండలాల్లోని గ్రామాలలో నీటి సమస్యను అధిగమించేలా చర్యలు చేపట్టాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇంటి పన్ను వసూలు నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఇప్పటివరకు గ్రామాల్లో వసూలు చేసిన ఇంటి పన్ను వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎప్పటికప్పుడు వసూలు చేసిన పన్నులకు చలానాలు కట్టి, సంబంధిత ఖాతాల్లో జమ చేయాలని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాలలో అన్ని రకాల వ్యాపారస్తుల వాణిజ్య లైసెన్సులను వంద శాతం పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. వనమహోత్సవం కార్యక్రమం ప్రారంభోత్సవం నాటికి గ్రామాల్లోని నర్సరీలో పెంచుతున్న మొక్కలను సిద్ధం చేయాలన్నారు. నర్సరీలో పెంచుతున్న మొక్కలకు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. మండల ప్రత్యేక అధికారులు ఎప్పటికప్పుడు గ్రామాలను సందర్శిస్తూ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పనులు సక్రమంగా జరుగుతున్నాయో లేదో తనిఖీ చేసి నివేదికలను పంపాలన్నారు. గ్రామాల్లో నిరంతరం మెరుగైన పారిశుధ్యాన్ని కొనసాగించాలన్నారు. మండల స్థాయి అధికారులకు గ్రామీణ స్థాయి అధికారులపై నియంత్రణ కలిగి ఉండాలన్నారు. అధికారులు, సిబ్బంది తమ విధి నిర్వహణలో సమయపాలన పాటించాలని సూచించారు. సమావేశంలో జెడ్పి సీఈఓ గోవింద్, డిఆర్డిఓ విజయలక్ష్మి, డిపిఓ శ్రీనివాస్, ఎంపీడీఓలు, ఎంపిఓలు పాల్గొన్నారు.

బెల్లంపల్లిలో పట్టపగలే దొంగతనం

తాండూర్ : బెల్లంపల్లి పట్టణంలోని కూరగాయల మార్కెట్ వద్ద శుక్రవారం మధ్యాహ్నం దొంగతనం జరిగింది. ఇద్దరు ఆగంతకులు సినీ ఫక్కీలో అక్కడ నిలిపి ఉంచిన బైక్‌లో ఉన్న రూ 4.40 లక్షలను ఎత్తుకెళ్లారు. బెల్లంపల్లి మండలం బట్వాన్‌పల్లి గ్రామానికి చెందిన దుర్గం వెంకటస్వామి శుక్రవారం తన అన్న కూతురు పెళ్లి ఉండడంతో బెల్లంపల్లి ఎస్బీఐలో రూ.4.40 లక్షలు డ్రా చేశారు. నగదు తన బైక్ ట్యాంక్ కవర్‌లో పెట్టుకొని కూరగాయలు కొనేందుకు నూతన కూరగాయల మార్కెట్ వద్దకు వెళ్లాడు. ఆగంతకులు నెంబరు ప్లేటులేని వాహనంపై వచ్చి వెంకటస్వామి నిలిపి ఉంచిన బైక్‌లో ఉన్న రూ.4.40 లక్షలు ఎత్తుకెళ్లిపోయారు. నగదు ఎత్తుకెళ్లిన ఆగంతకులు బ్యాంకులో డబ్బులు డ్రా చేసినప్పట్నుండి వెంబడిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ సంఘటనకు సంబంధించిన చిత్రాలు బెల్లంపల్లి బజార్ ఏరియాలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలలో రికార్డు అయ్యాయని పోలీసులు తెలిపారు. బాధితుడు దుర్గం వెంకటస్వామి పోలీసులను ఆశ్రయించడంతో వన్ టౌన్ సిఐ నీలాల దేవయ్య దర్యాప్తు జరుపుతున్నారు.

కిష్టాపూర్ పాఠశాలకు చేరుకున్న కలాం స్ఫూర్తి బస్సు యాత్ర



నవతెలంగాణ-జన్నారం

మారుతున్న కాలానికి అనుగుణంగా శాస్త్ర, సాంకేతిక వినియోగం పెరిగిపోతున్న నేపథ్యంలో టెక్నాలజీని విద్యార్థులు అనివార్యంగా భావించాలని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గుండ రాజన్న అన్నారు. విద్యార్థుల్లో సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించడమే లక్ష్యంగా చేపట్టిన కలాం స్ఫూర్తి యాత్ర బస్సు శుక్రవారం మండలంలోని కిష్టాపూర్ ప్రభుత్వ పాఠశాలకు చేరుకుంది. ఎడోద్వాజ సంస్థ వ్యవస్థాపకుడు, సిఈఓ మధులాష్ బాబు నేతృత్వంలో ప్రారంభమైన ఫ్లో బస్సు(ఫ్యూచరిస్టిక్ ల్యాబ్ ఆన్ వీల్స్) ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మధులాష్ బాబు యువతకు సాంకేతికతను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చే దిశగా కృషి చేస్తున్నారు. ఫ్లో బస్సు, ఐఒటీ, ఏఆర్/వీఆర్, రోబోటిక్స్, ఏఐ, 3డి ప్రింటింగ్ వంటి 16 ఆధునిక సాంకేతికతలను ప్రత్యక్షంగా ప్రదర్శన ద్వారా విద్యార్థులకు ప్రాక్టికల్ అనుభవాన్ని అందిస్తోంది. సాంకేతిక పరిజ్ఞానం పట్ల ఆసక్తిని రగిలించి, విద్యార్థుల్లో ఆవిష్కరణా శక్తిని పెంచడానికి ఈ యాత్ర విశేష కృషి చేస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు గోవర్ధన చారి, రాజన్న, బుచ్చి లింగయ్య, ప్రకాష్ బానావత్, నగేష్, అశోక్ కుమార్, జ్యోతిశీల, నరహరిశర్మ, శ్రీనివాస్, రజిత రాణి, కాంతయ్య, బి. శ్రీనివాస్, అజీమ్, సుస్మిత, స్వప్న విద్యార్థులు పాల్గొన్నారు.



మాల సంఘం ఆధ్వర్యంలో రమాబాయి జయంతి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రమాబాయి అంబేద్కర్ 127వ జయంతిని శుక్రవారం సంఘం కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు కొప్పుల రమేష్ మాట్లాడారు. డా.బీఆర్ అంబేద్కర్ లండన్‌లో చదువుతున్న సమయంలో తను పస్తులున్న కానీ అంబేద్కర్‌కు తెలియనీయలేదన్నారు. అదే సమయంలో తన నలుగురు సంతానం కూడా మరణించారని అటువంటి వీరనారి రమాబాయి అంబేద్కర్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షులు మేకల మల్లన్న, ఎలుక రాజు, పాశం రాఘవేంద్ర, బోండ్ల వెంకటస్వామి, మాదాసు అర్జున్, చంటి రవి, బోండ్ల భూమన్న, నర్సింలు, రాములు, పోశెట్టి, ప్రభాకర్, కంది చంద్రశేఖర్, కూనమల్ల గంగన్న పాల్గొన్నారు.



సొనాల మండల అధికారులకు సన్మానం

నవతెలంగాణ-బోథ్

సొనాల మండల కేంద్రంలో తహసీల్దార్ రాజేశ్వర్, ఎంపీడీఓ రమేష్, సిబ్బందిని సొనాల మాజీ సర్పంచ్ చెట్లపెల్లి సదానందం గ్రామ ప్రజలు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ మాట్లాడుతూ అధికారులకు సొనాల గ్రామ ప్రజల సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని అన్నారు. కొత్త మండల అభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో గుర్రాల తండా మాజీ సర్పంచ్ సకారాం, నాయకులు జీవన్‌కుమార్, సుధీర్‌రెడ్డి, చిన్నయ్య, కిష్టయ్య, శంకర్, నరేందర్, గ్రామస్తులు పాల్గొన్నారు.



కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలి

- సీఐటీయూ జెండావిష్కరణ



నవతెలంగాణ-జైనథ్

కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ అన్నారు. శుక్రవారం బోరజ్ మండలంలోని పిప్పరవాడ టోల్ ప్లాజా వద్ద ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్‌తో కలిసి సీఐటీయూ జెండాను ఆవిష్కరించారు. అనంతరం కార్మికులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టోల్‌ప్లాజా కార్మికుల సమస్యలను కేంద్ర ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పిప్పరవాడ టోల్‌ప్లాజా యూనియన్ అధ్యక్షులు అక్కూర్ సంతోష్, ముక్కెర ప్రభాకర్, మేకల రమేష్, నర్సింగ్, లతీఫ్, ఆర్గుల ఆశన్న, మన్నే రాకేష్, సిలిగాం ఆశన్న, పురుషోత్తం, ప్రదీప్‌రెడ్డి, సందీప్‌రెడ్డి, ఎల్టీ సాయి రెడ్డి, యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

అల్బెండోజోల్ మాత్రలను పిల్లలందరూ వాడాలి



నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

అల్బెండోజోల్ మాత్రలను పిల్లలందరూ వాడాలని ముజ్గి మేడికల్ ఆఫీసర్ డాక్టర్ గుప్తా అన్నారు. శుక్రవారం నిర్మల్‌రూరల్ మండలం చిట్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు నులి పురుగుల వలన కలిగే వ్యాధుల గురించి వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లల్లో నులిపురుగులు ఉండటం వలన పోషకాహార లోపం, రక్తహీనత, బలహీనత, ఆకలి లేకపోవడం, వికారం, అతిసారం గురవుతారని తెలియజేశారు. విద్యార్థులందరూ తప్పని సరిగా అల్బెండోజోల్ మాత్రలను తప్పని సరిగా వేసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ సునీతా, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటేష్, ఉపాధ్యాయులు గజపల్లి నర్సయ్య వహీద్, సంతోష్, అనూష, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజల భద్రతకే కార్డెన్ సెర్చ్



నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

ప్రజల భద్రతకే కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్నామని ఏఎస్పీ రాజేష్ మీనా అన్నారు. శుక్రవారం మండలంలోని చిట్యాలలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. సరైన పత్రాలు లేని 58 బైక్‌లు, 4 కారులు సీజ్ చేస్తామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సైబర్ క్రైమ్ పట్ల ప్రతీ ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, ప్రతీ గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలు పాటించాలని సూచించారు. ఇందులో రూరల్ సీఐ రామకృష్ణ, ఎస్సై లింబాద్రి, దిలావర్‌పూర్, నర్సాపూర్ ఎస్సైలతో పాటు పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

- చలో హైదరాబాద్ జయప్రదం చేయాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 20న ఛలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.వెంకటనారాయణ అన్నారు. కాగా కరపత్రాలను కుమురంభీం భవనంలో శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీలను వాగ్దానాలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని అన్నారు. 6 గ్యారంటీలతో పాటు, ఏడో హామీ ప్రజాస్వామిక హక్కులను పునరుద్ధరణ చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం 2023 ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలల్లో ఆరు గ్యారంటీలతో పాటు మొత్తం 420 హామీలను ఇచ్చిందని అధికారంలోకి వచ్చి 14 నెలలు గడుస్తున్న ఇందులో ఒకటి అర వాగ్దానాలు తప్ప అత్యధికం అలాగే ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు గౌరాల సుభాష్, దేవిదాస్, ప్రసాద్, పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి మడావి గణేష్, పివైఎల్ రాష్ట్ర నాయకులు మెస్రం మారుతి పాల్గొన్నారు.

నేడు పూలాజీ బాబా వార్షికోత్సవం

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మండలంలోని ఆంధ్ హర్కాపూర్ గ్రామంలో శనివారం పూలాజీ బాబా వార్షికోత్సవం నిర్వహిస్తున్నట్టు మాజీ సర్పంచ్ కుడే కైలాస్ తెలిపారు. ఈ కార్యక్రమానికి భక్తులు, ఆంధ్ ఆదివాసీ సంఘం నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని, విజయవంతం చేయాలని కోరారు.

సమస్యల పరిష్కారానికే ప్రజా ఫిర్యాదులు



నవతెలంగాణ-తలమడుగు

ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు తమ వంతు కృషి చేస్తున్నామని జెడ్పీ సీఈఓ జితేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని వెంకటేశ్వర ఆలయ ప్రాంగణంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార బహిరంగ విచారణను చేపట్టారు. ఈ ఫిర్యాదుల పరిష్కారానికి మండల ప్రజలు వివిధ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. రుణమాఫీ, ఇందిరమ్మ ఇండ్లు, వివిధ రకాల పింఛన్లు మంజూరు కావడం లేదంటూ, గతంలో కూడా అనేకసార్లు కార్యాలయాల చుట్టూ తిరిగిన సమస్యలు నెరవేర్చలేదంటూ అధికారులకు విన్నవించారు. కాగా మండల కేంద్రానికి చెందిన జింక ఎర్రన్న గత ఆరు సంవత్సరాల కింద అనారోగ్యంతో మృతి చెందగా భార్య దేవుబాయి వితంతు పింఛన్ కోసం దరఖాస్తు చేసుకోగా, ప్రభుత్వ రికార్డులో దేవ్‌బాయి చనిపోయినట్లు చూపిస్తున్నారంటూ దేవుబాయి తన గోడును వెళ్లబోసుకొంది. తన భర్త ఎర్రన్న చనిపోయాడు. నేను ఆయన భార్యను బతికే ఉన్నానంటూ వితంతురాలు పింఛన్ మంజూరు చేయాలన్నారు. అధికారుల చుట్టూ తిరిగి మొరపెట్టుకున్నప్పటికీ పట్టించుకోలేదంటూ అధికారుల దృష్టికి తీసుకువచ్చింది. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయానికి సమాచారం అందించారు. అదేవిధంగా హైదరాబాద్ అధికారులతో మాట్లాడ గా మీ సేవలో తప్పుగా ధృవీకరణ పత్రాలు అందజేసినట్లు తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి వందలాదిమంది తరలివచ్చి తమ సమస్యలను అధికారులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ వినోద్ కుమార్, మండల ప్రత్యేకాధికారి, మండలాభివృద్ధి అధికారి శేఖర్, తహసీల్దార్ రాజమోహన్, డిప్యూటీ తహసీల్దార్ ప్రభాకర్ పాల్గొన్నారు.

మహా ధర్నాను జయప్రదం చేయాలి



నవతెలంగాణ-కడెం

మహా ధర్నాను జయప్రదం చేయాలని ప్రజా సంఘాల పోరాట వేదిక జిల్లా కన్వీనర్ నూతన్ కుమార్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర బడ్జెట్‌లో జాతీయ గ్రామీణ ఉపాధి చట్టానికి రెండు లక్షల కోట్ల రూపాయలు కేటాయించాలని, అన్ని వర్గాల అభివృద్ధికి సరైన నిధులు కేటాయించాలని అన్నారు. ఈ నెల 10న హైదరాబాద్‌లోని ఇంద్రాపార్క్ వద్ద నిర్వహిస్తున్న మహాధర్నాలో వ్యవసాయ కూలీలు, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కార్మికులు, కార్మికులు కర్షకులు, వృత్తిదారులు, అన్ని వర్గాల ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి నేటి వరకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి నిధులు తగ్గిస్తు పథకాన్ని ఎత్తివేయాలనే కుట్రను చేస్తుందని విమర్శించారు. ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రెండు లక్షల కోట్లు రూపాయలు కేటాయించాల్సింది. కాగా కేవలం రూ.85 వేల కోట్లను కేటాయించడం చాలా దారుణమని అన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీకి, సామాజిక అభివృద్ధికి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. అనంతరం మహా ధర్నా కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి బొమ్మెన సురేష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు డాకూర్ తిరుపతి పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం



నవతెలంగాణ-కడెం

కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని కాంగ్రెస్ సీనియర్ నాయకులు పడిగెల భూషణ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఎస్సీ వర్గీకరణ విజయోత్సవ సంబరాల్లో భాగంగా డా.బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, స్త్రీ శిశు సంక్షేమ,గిరిజన సంక్షేమ మంత్రి సీతక్క, మంత్రి దామోదర రాజనర్సింహ, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, ఎస్సీ కార్పొరేషన్ చైర్మెన్ నగరిగిరి ప్రీతం చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పడిగెల భూషణ్ మాట్లాడారు. మాదిగల విషయంలో ఉమ్మడి రాష్ట్రంలో కూడా ఏ ప్రభుత్వాలు మారిన, అలాగే తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక కూడా వారిని పట్టించుకోలేదన్నారు. కానీ రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ ఆమోద బిల్లుకు ఆమోదం తెలపడం చాలా హర్షించదగ్గ విషయమని అన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, వారి మంత్రి మండలికి, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల నాయకులు మాజీ సర్పంచ్ చిట్యాల చిన్నయ్య, పడిగెల రాజు, మాదిగ ఉపకుల సంఘం మాస్టిన్, రాష్ట్ర ఉపాధ్యక్షులు నాగిళ్ల ఆశన్న, డాక్టర్ ఆనంద్, చిట్యాల రవి, బాలరాజ్, సంసోన్, దయాకర్, దోనూర్ రాజేందర్, శ్రీను, నల్వాల గంగారాం నాయకులు పాల్గొన్నారు.

ప్రాథమిక దశలో గుర్తించి చికిత్స తీసుకోవాలి

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ నరేందర్ రాథోడ్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

కుష్టు వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించి, చికిత్స తీసుకుంటే ఎలాంటి అంగవైకల్యం కలగదని డీఎంహెచ్‌ఓ డాక్టర్ నరేందర్ రాథోడ్ అన్నారు. శుక్రవారం మండలంలోని చాంద(టి) మైనారిటీ బాలుర పాఠశాలలో స్పర్శ్ లెప్రసీ అవేర్నెస్ క్యాంపెయిన్ లో భాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అంకోలి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ మైకో బ్యాక్టీరియం లేప్రే అనే బ్యాక్టీరియా వల్ల కుష్టు వ్యాధి వస్తుందని అన్నారు. శరీరంపై పాలిపోయిన రాగి రంగు గల మొద్దు వారిన మచ్చలు, కాళ్ల చేతుల్లో తిమ్మిర్లు రావడం కుష్టు వ్యాధికి సంబంధించిన లక్షణాలు అని తెలిపారు. ఈ వ్యాధికి అన్ని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఆస్పత్రుల్లో ఎండీటీ చికిత్సను అందిస్తున్నామని తెలిపారు. అనుమానిత లక్షణాలు ఉన్నవారు దగ్గరలోని ఆశా కార్యకర్తలను, వైద్య సిబ్బందిని, వైద్యులను ఆస్పత్రులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ పారా మెడికల్ అధికారి వామన్‌రావు, ఎంఎల్‌హెచ్‌పీ అశ్విని, ఆరోగ్య పర్యవేక్షకులు సుభాష్, ఏఎస్‌ఎం తార, ప్రిన్సిపల్ వందన, ఆశా కార్యకర్త పార్వతి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాదిగల పక్షపాతి సీఎం రేవంత్‌రెడ్డి

నవతెలంగాణ-ఉట్నూర్



ఎస్సీ వర్గీకరణ విజయోత్సవ సంబరాల్లో ఆదిలాబాద్ డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ లింగంపల్లి చంద్రయ్య శుక్రవారం పాల్గొన్నారు. మండలంలోని బీర్సాయిపేట్, ఉట్నూర్‌లో కాంగ్రెస్ ఎస్సీ విభాగం ఆధ్వర్యంలో మాదిగ కుల పెద్దలతో కలిసి డప్పులతో ర్యాలీగా వచ్చి అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, ఎస్సీ కార్పొరేషన్ చైర్మెన్ నగరిగిరి ప్రీతం చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 30 సంవత్సరాల కల కాంగ్రెస్ వల్ల సాధ్యమైందని, దమ్మున్న నాయకుడు సీఎం రేవంత్ రెడ్డి అని అన్నారు. మాదిగల విషయంలో ఎన్ని ప్రభుత్వాలు మారిన పట్టించుకున్న వారు లేరని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు మందకృష్ణ మాదిగ ఉద్యమ కృషికి వర్గీకరణ ఫలితం, రేవంత్ రెడ్డి రాజకీయ జీవతంలో ఆయన ఎదిగిన ప్రతి చోట మాదిగలు ఆయనకు తోడుగా నిలిచారు. అందుకు కృతజ్ఞతగా మాదిగల రుణం రేవంత్‌రెడ్డి వర్గీకరణ ద్వారా తీర్చేసుకున్నారని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బిరుదుల లాజర్, సామాజిక కార్యకర్త అరకిల్ల అశోక్, ముడుగు అమృత రావ్, రవి, ప్రకాష్, విజయ్, సరళ, లక్ష్మి, అనిత, బీర్సాయి పేట్ గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.

పద్మశాలి ఇంజనీర్ల డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

జిల్లా కేంద్రంలోని విశ్వేశ్వరయ్య భవన్‌లో శుక్రవారం తెలంగాణ పద్మశాలి ఇంజనీర్ల డైరీ, క్యాలెండర్‌లను పద్మశాలి ఇంజనీర్ల సంఘం అధ్యక్షుడు మిట్టపల్లి మధుకర్, ప్రధాన కార్యదర్శి బూర ఉమాశంకర్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సంఘ పరంగా చేపట్టే పలు కార్యక్రమాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ తాటిపాముల శంకరయ్య, రిటైర్డ్ ఇంజనీర్లు వడ్లకొండ వెంకటపతి, జల్ద గంగాధర్, కోశాధికారి గర్దాసు చక్రధర్, సుభాష్, ఇతర ఇంజనీర్లు పాల్గొన్నారు.

విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



నవతెలంగాణ-బోథ్

విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగిఉండాలని షీటీమ్ ఏఎస్సై సునిత అన్నారు. శుక్రవారం సొనాల మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పలు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తత, ఈవ్ టీజింగ్, ఫోటో మార్ఫింగ్ సోషల్ మీడియా పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అలాగే అత్యావసర సమయంలో 100, 1930 ఫోన్ నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో షీటీమ్ హెడ్ కానిస్టేబుల్ సుశీల, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సచిన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గురుకులం డైరీ ఆవిష్కరణ



నవతెలంగాణ-ఉట్నూర్

తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకులాల ఉపాధ్యాయ సంఘాల డైరీని శుక్రవారం ఐటీడీఏ కార్యాలయంలో ఐటీడీఏ పీఓ ఖుష్బు గుప్తా విడుదల చేశారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడారు. ముందు వచ్చే విద్యా సంవత్సరంలో పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలలో 100శాతం ఉత్తీర్ణత సాధించే దిశగా ఉపాధ్యాయులు కష్టపడాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్సీఓ ఆగస్టు, ప్రెసిడెంట్ గోవర్ధన్, వైస్ ప్రెసిడెంట్ రాజేందర్ ప్రసాద్, ప్రిన్సిపాల్ హరిరాం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాలను విడుదల చేయాలి

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి బొమ్మెన సురేష్

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

ఎస్సీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాలను వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బొమ్మెన సురేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నిర్మల్ జిల్లాలోని 19 మండలాలలో ఎంపికైన 256 మందికి సంబంధించిన ఎస్సీ కార్పొరేషన్ రుణాల సబ్సిడీని వెంటనే మంజూరు చేయాలని కోరారు. గ్రామసభలో తీర్మానం చేసి మండల స్థాయిలో ఎంపీడీఓ ఎంపిక చేసిన తరువాత బ్యాంకు మేనేజర్ ద్వారా ఎంపిక చేసిన 2020-21 సంవత్సరానికి సంబంధించి 256 మంది లబ్ధిదారులకు సంబంధించి సబ్సిడీ రుణాలను ఇప్పటివరకు మంజూరు చేయలేదని, రుణాల కోసం లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఎస్సీ కార్పొరేషన్ బడ్జెట్ కేటాయించి, సబ్సిడీ డబ్బులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి



నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

మండలంలోని వెంగ్వాపేట్ ఉన్నత పాఠశాలను డీఈఓ శుక్రవారం ఉదయం పాఠశాలలో జరిగే ప్రార్థనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థుల సంఖ్య, హాజరు శాతం, సిబ్బంది పనితీరు ఉన్న సౌకర్యాలు కావాల్సిన వాటిపై ఆరా తీశారు. పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కష్టపడాలన్నారు. మెనూ ప్రకారం భోజనం ఖచ్చితంగా అందించాలన్నారు. ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

10న విజయ హైస్కూల్ వార్షికోత్సవానికి త్రిపుర గవర్నర్

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

నిర్మల్ జిల్లా కేంద్రంలోని మంజులాపూర్‌లోని విజయ హైస్కూల్ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 10న నిర్వహించే కార్యక్రమానికి త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి హాజరవుతున్నట్లు మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నాయకుడు నల్ల ఇంద్రకరణ్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానికంగా నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ హాజరవుతారన్నారు.

ఎస్పీఎం ఆధ్వర్యంలో ఉచిత ఆరోగ్య శిబిరం

నవతెలంగాణ-కాగజ్‌నగర్



సిర్పూరు పేపర్ మిల్లు, స్వర్ణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కాగజ్‌నగర్ మండలంలోని జగన్నాథ్‌పూర్ గ్రామంలో శుక్రవారం ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించారు. వైద్యులు భానుప్రకాష్, బి వెంకటేశ్వర్లు పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా మిల్లు జనరల్ మేనేజర్ ఎంఎస్ గిరి మాట్లాడుతూ మారుమూల గ్రామాల్లోని ప్రజలంతా ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశ్యంతో మెడికల్ క్యాంప్‌లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్పీఎం ప్రతినిధి తుమ్మ రమేష్, వైద్య సిబ్బంది శ్రీవాణి, రేఖ, విజయ్‌కుమార్, గ్రామయువత ప్రేంసాగర్, డోకె రవికుమార్, డొంగ్రి మోహన్, శంకర్ పాల్గొన్నారు.

విహార యాత్రకు జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు

నవతెలంగాణ-పెంచికల్‌పేట్



మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులను పీఎం శ్రీ పథకంలో భాగంగా మహారాష్ట్ర బల్లార్షా పట్టణ సమీపంలోని వీసపూర్‌లో గల అటల్ బిహారీ వాజ్‌పెయి బొటానికల్ గార్డెన్ విహార యాత్రకు తీసుకెళ్లినట్లు పాఠశాల హెచ్‌ఎం విజయ నిర్మల తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సైన్స్ ల్యాబ్ రాకెట్ లాంచింగ్, సౌర కుటుంబం, రేఖాగణితము వివిధ బోధనోపకరణాలు, బయోడైవర్సిటీ, వివిధ రకాల మొక్కలు, జంతువుల గురించి అవగాహన కల్పించినట్లు పేర్కొన్నారు. ఆమె వెంట ఏపీసీ చైర్మన్ స్వప్న పాఠశాల ఉపాధ్యాయులు ఉన్నట్లు పేర్కొన్నారు.

నామినేషన్‌కు తరలిన పీఆర్‌టీయూటీఎస్ నాయకులు



నవతెలంగాణ-కాగజ్‌నగర్

కరీంనగర్-మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పీఆర్‌టీయూటీఎస్ అభ్యర్థి వంగ మహేందర్‌రెడ్డి నామినేషన్ కార్యక్రమానికి కాగజ్‌నగర్ నుండి ఆ సంఘం ఉపాధ్యాయ నేతలు శుక్రవారం తరలివెళ్లారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎటుకూరి శ్రీనివాస్‌రావు, సునార్కర్ అనిల్‌కుమార్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించే సత్తా కేవలం పీఆర్‌టీయూటీఎస్‌కే ఉందని, మెరుగైన పీఆర్‌సీ సాధించడంలో మహేందర్‌రెడ్డి కృషి ఉంటుందని అన్నారు. ప్రతీ ఏటా పదోన్నతులు, సీపీఎస్ రద్దు, కేజీబీవీ, ఐటీడీఏ సీఆర్‌టీల సమస్యల పరిష్కారానికి వంగా మహేందర్‌రెడ్డి గెలుపే పరిష్కారమని అన్నారు. ఈ కార్యక్రమంలో నరసింహాచారి, భిక్షపతి, జాడి శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, సదానందం, గోర్‌సింగ్, రాజు, తిరుపతి, యాదగిరి, కొయ్యడ శ్రీనివాస్, ఆడె జంగం, వినోద్, సునీత, సమత, గంగాభవాని, సుజాత, శ్రీలత, కవిత, శైలజ పాల్గొన్నారు.

గోలేటి సీహెచ్‌పీకి రోడ్డు నిర్మించండి

నవతెలంగాణ-రెబ్బెన

బెల్లంపల్లి ఏరియా గోలేటి సీహెచ్‌పీలో పనిచేస్తున్న కార్మికులకు డ్యూటీకి రావడానికి రోడ్డు మార్గం కల్పించాలని బెల్లంపల్లి ఏరియా వైస్ ప్రెసిడెంట్ పతం రాజబాబు డిమాండ్ చేశారు. ఈ విషయమై శుక్రవారం సీహెచ్‌పీ అధికారి ఎస్సీ కోటయ్య హెచ్‌ఎంఎస్ యూనియన్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సరైన రోడ్డు మార్గం లేక కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని, వర్షం పడితే ద్విచక్రవాహనాలు జారిపడి గాయాలపాలవుతున్నారన్నారు. తక్షణమే రోడ్డు సౌకర్యం కల్పించాలన్నారు. ఇందులో వీణ, ఆరీఫ్, ఉమామహేశ్వర్, దత్తు ఉన్నారు.

తునికాకు సేకరణకు టెండర్లు పిలవాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో తునికాకు సేకరణకు వెంటనే టెండర్లు పిలవాలని తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కోట శ్రీనివాస్ డిమాండ్ చేశారు. జిల్లా అటవీ శాఖ కార్యాలయంలో శుక్రవారం వినతిపత్రం అందజేసి, అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో వ్యవసాయం తర్వాత తునికాకు సేకరణ రెండో అతిపెద్ద ఆదాయ వనరుగా ఉందన్నారు. ప్రతి సంవత్సరం డిసెంబర్, జనవరి మాసాలలో టెండర్లు పూర్తి చేసి ఫిబ్రవరి మాసంలో ఆకు సేకరణ పనులలో భాగంగా రెండో వారంలో కొమ్మకొట్టే కార్యక్రమం నిర్వహిస్తారని అన్నారు. ప్రస్తుత సీజన్‌లో ఈ ప్రక్రియ ఇంకా ప్రారంభం కాలేదని దీనికి కారణం టెండర్లు కాకపోవడమే అన్నారు. వెంటనే టెండర్లు పూర్తి చేసి ఆకు సేకరణ పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఇందులో సంఘం జిల్లా నాయకులు ఆత్రం బాపూరావు, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గేడం టికానంద్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ప్రతిపాదనలతోనే అభివృద్ధి పనుల మంజూరు

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు ధోని శ్రీశైలం

నవతెలంగాణ-కాగజ్‌నగర్

సిర్పూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు ప్రతిపాదనలతోనే పలు అభివృద్ధి పనులు మంజూరవుతున్నాయని బీజేపీ జిల్లా అధ్యక్షులు ధోని శ్రీశైలం అన్నారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనులు మంజూరైన తర్వాత ఆ పనులు తామే మంజూరు చేయించినట్లు కాంగ్రెస్ నాయకులు ప్రకటనలు చేసుకోవడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. ఎస్‌టీఎస్‌డీఎఫ్ నిధులు రూ. 10 కోట్లతో పలు అభివృద్ధి పనులు మంజూరైతే ఆ పనులన్నీ తమ ఎంఎల్‌సీ మంజూరు చేయించినట్లు చెప్పుకోవడం సిగ్గుచేటనీ, ఈ పనుల ప్రతిపాదనలను గత డిసెంబర్ నెలలోనే ఎమ్మెల్యే హరీష్‌బాబు గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శికి లేఖ రాసారని చెపుతూ ఆ లేఖను చూపించారు. కాంగ్రెస్ నాయకులు ప్రతిపాదనలు చేస్తే ఆ ప్రతిపాదనల ప్రతిని చూపిస్తారా అని సవాల్ చేశారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే పాటు పడుతున్నారని, దీనిని సహించలేని కాంగ్రెస్ నాయకులు ఇలాంటి ఆరోపణలు దిగుతున్నారని అన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ప్రకటనలు చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమానికి కృషి

నవతెలంగాణ-రెబ్బెన

తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమానికి కృషి చేస్తామని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కో కన్వీనర్ దుర్గం రవీందర్, ఆసిఫాబాద్ నియోజకవర్గ కన్వీనర్ అజ్మీరా బాబూరావు అన్నారు. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర చైర్మన్ చీమ శ్రీనివాస్ ఆదేశాల మేరకు శుక్రవారం తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రెబ్బెన మండల కన్వీనర్‌గా మండల కేంద్రానికి చెందిన వినోద్ జైస్వాల్‌ను నియమించినట్లు తెలిపారు. ఈ మేరకు గోలేటిలో నియామక పత్రాన్ని అందజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు చేసే విధంగా ఫోరం కషి చేస్తుందని అన్నారు. ఇందులో ఉద్యమకారులు తోట లక్ష్మణ్, శ్రీధర్, నర్సయ్య, దయాకర్ పాల్గొన్నారు.

ఘనంగా రమాబాయి జయంతి

నవతెలంగాణ-దహెగాం

మండల కేంద్రంలో మాతా రమాబాయి 127వ జయంతి వేడుకలను అంబేద్కర్ సంఘం నాయకులు శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బౌద్ధ సంఘం మండలాధ్యక్షుడు కుమ్మరి రాజన్న, రాజ్యాంగ అవగాహన వేదిక ఉపాధ్యక్షులు దుర్గం రాజారాం, బౌద్ధ సంఘం మండల నాయకుడు పెరుగు శంకర్, సమతా సైనిక దళ్ మండల నాయకులు చల్లూరి శ్రీనివాస్, వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి అధ్యక్షుడు తోగం అశోక్, ముడి మడుగుల రాజేశ్వర్ పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు సహకరించాలి

- ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేష్ దోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ దోత్రే కోరారు. ఎన్నికల నిర్వహణపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆర్డీఓ లోకేశ్వర్ రావుతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నిర్వాహణ కోసం 17 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. పట్టభద్రులు 6137, ఉపాధ్యాయులు 470 మంది ఓటు హక్కు కలిగి ఉన్నారన్నారు. రాజకీయ పార్టీలకు పోలింగ్ కేంద్రాల జాబితా, ఓటర్ల జాబితాలను అందజేస్తామని, ఈనెల 27న ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ ఉంటుందన్నారు. పోలింగ్ కేంద్రాలలో తాగునీరు, షామియానాలు, ఫ్యాన్లు మిగతా వసతులను కల్పిస్తున్నామన్నారు. ఆయా పార్టీలు ఏజెంట్ల జాబితాను అందజేయాలన్నారు. కౌంటింగ్ మార్చి 3న కరీంనగర్‌లో ఉంటుందన్నారు. ఈ సమావేశంలో తహసీల్దార్ రోహిత్ దేశ్ పాండే, ఎన్నికల పర్యవేక్షకుడు సునీల్, డీటీ శ్యామ్ లాల్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

జిల్లా ఆస్పత్రికి వచ్చే రోగులకు నాణ్యమైన సేవలు అందించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. శుక్రవారం జిల్లా ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్య సేవలు, మందుల పంపిణీ గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో ప్రసవాలపై వాకబు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పేద రోగుల వైద్యానికి అవసరమైన ఏర్పాట్లు చేస్తుందని వాటిని క్షేత్రస్థాయిలో అందేలా చూడాలన్నారు. జిల్లాలో జరిగే ప్రతి ప్రసవం ఆసుపత్రిలో జరిగే విధంగా వైద్య సిబ్బంది చూడాలన్నారు. దీనికోసం గర్భం దాల్చిన మహిళలను గుర్తించి వారికి తొమ్మిది నెలలపాటు అవసరమైన పౌష్టికాహారం అందించడంతో పాటు సుఖ ప్రసవానికి సిబ్బంది కషి చేయాలన్నారు. అప్పుడే వైద్య సేవలపై సాధారణ ప్రజలకు నమ్మకం కలుగుతుందని సూచించారు. జిల్లా ఆస్పత్రికి వచ్చే రోగులకు అత్యవసరమైతే తప్ప మంచిర్యాలకు పంపించకూడదన్నారు. అనంతరం డయాలసిస్ సెంటర్ పరిశీలించారు. సెంటర్ అబాసుపాలు కాకుండా చూడాల్సిన బాధ్యత వైద్యులపైనే ఉందన్నారు. నిర్మాణంలో ఉన్న 320 పడకల ఆసుపత్రిని పరిశీలించి నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. ఇందులో ఆసుపత్రి సూపరింటెండెంట్ ప్రవీణ్, ఇతర సిబ్బంది సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

వనం వీడి జనంలోకి రావాలి : ఎస్పీ



నవతెలంగాణ-పెంచికల్‌పేట్

వనం వీడి జనంలోకి రావాలని ఎస్పీ శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం మండలంలోని అగరుగూడా గ్రామంలో 'పోరుకన్నా. ఊరు మిన్న' కార్యక్రమంలో భాగంగా అగర్‌గూడ గ్రామానికి చెందిన మావోయిస్టు సభ్యురాలు చౌదరి అంకుబాయి అలియాస్ అనిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా అంకుబాయి కుటుంబ సభ్యుల ఆరోగ్య పరిస్థితులు, ఆర్థిక పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అంకుబాయి కుటుంబ సభ్యులకు నిత్యావసర సరకులు, దుస్తులు పోలీసు అధికారులు అందజేశారు. ఏదైనా ఆరోగ్య సమస్య ఏర్పడితే వైద్య చికిత్సలు అందించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. వనం వీడి జనంలోకి రావాలని, జనజీవన స్రవంతిలో కలిస్తే వారిపై ఉన్న రివార్డ్ పాటు ప్రభుత్వం నుంచి వచ్చే ప్రయోజనాలు అందేలా కృషి చేస్తామని ఎస్పీ హామీ ఇచ్చారు. అనంతరం గ్రామస్తులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ ప్రజలు, యువత చెడు వ్యసనాలకు, అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని పేర్కొన్నారు. గ్రామస్తుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు, సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని అన్నారు. అనంతరం వద్ధులకు చీరలు, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాగజ్‌నగర్ డీఎస్పీ రామనుజం, రూరల్ సీఐ శ్రీనివాసరావు, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్‌పెక్టర్ రాణా ప్రతాప్, పెంచికల్ పెట్ ఎస్సై కొమురయ్య, ఆర్ఎస్ఐ ఓదేలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యమ నాయకున్ని గెలిపించాలి : టీఎస్‌యూటీఎఫ్

నవతెలంగాణ-కాగజ్‌నగర్



రానున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో ఉద్యమ నాయకుడు, టీఎస్‌యూటీఎఫ్ బలపర్చిన టీపీటీఎఫ్ అభ్యర్థి అశోక్‌కుమార్‌ను గెలిపించాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు వైద్య శాంతికుమారి అన్నారు. శుక్రవారం కాగజ్‌నగర్‌లో కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఉపాధ్యాయుల సంక్షేమం, ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ కోసం చేపట్టిన పలు ఉద్యమాలలో అశోక్‌కుమార్ కీలకపాత్ర పోషించారని, 36 ఏళ్లుగా ఉపాధ్యాయరంగంలో సేవలందిస్తున్నారని ఆమె తెలిపారు. ధన రాజకీయాలను ఓడించి, ఉద్యమనేతను గెలిపించుకుంటే విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి అవకాశం ఏర్పడుతుందని అన్నారు. కరీంనగర్ నియోజకవర్గం ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న అశోక్‌కుమార్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి మహిపాల్, మండల నాయకులు బాజీఖాన్, రంజిత్‌కుమార్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

- అదనపు కలెక్టర్ దీపక్ తివారి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా చేపట్టిన నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. శుక్రవారం జిల్లాలోని జైనూర్ మండలం పట్నాపూర్ గ్రామపంచాయతీలో కొనసాగుతున్న కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్ నిర్మాణ పనులను పరిశీలించి పనుల్లో వేగం పెంచాలన్నారు. ఆశ్రమ బాలికల పాఠశాలను సందర్శించి తరగతి గదులు, వంటశాల, మూత్రశాలలు, తాగునీటి సౌకర్యం, పరిసరాలు, మౌలిక సదుపాయాలను పరిశీలించారు. మెనూ ప్రకారం పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించాలని సూచించారు. ఏకాగ్రతతో చదివి వార్షిక పరీక్షలలో 100 శాతం ఉత్తీర్ణత సాధించాలని 10వ తరగతి విద్యార్థులకు, వార్షిక పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ సెంటర్లను, ఆశ్రమ బాలుర పాఠశాలను సందర్శించి పరిశీలించారు. మధ్యాహ్న భోజనం నాణ్యత, పాఠ్యాంశాల బోధన అంశాలపై విద్యార్థులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్నం భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

కందుల కొనుగోలు కేంద్రం ప్రారంభం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

నాఫెడ్ సౌజన్యంతో తెలంగాణ రాష్ట్ర మార్క్ ఫెడ్ ఆధ్వర్యంలో స్థానిక పీఏసీఎస్ నేతత్వంలో జిల్లా కేంద్రంలోని మార్కెట్ యార్డులో కందుల కొనుగోలు కేంద్రాన్ని అధికారులు ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా సహకార అధికారి బిక్కు నాయక్ మాట్లాడుతూ కందుల కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకొని మద్దతు ధర పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి వ్యవసాయ అధికారి మిలింద్, జిల్లా మార్కెట్ కమిటీ అధికారి అశ్వక్ అహ్మద్, జిల్లా అదనపు సహకార అధికారి షేక్ మహమూద్, రైతులు రాజన్న, పర్వతాలు, బిజ్జు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆసిఫాబాద్ : పట్టణ 11 కేవీ రెండవ విద్యుత్ సబ్ స్టేషన్ నెలవారి మరమ్మత్తుల్లో భాగంగా జిల్లా కేంద్రంలో శనివారం ఉదయం 9 గంటల నుండి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం విధిస్తున్నట్లు పట్టణ ఏఈ లక్ష్మీరాజం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

నాణ్యమైన భోజనం అందించాలి

కౌటాల : విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంపీడీఓ కోట ప్రసాద్ అన్నారు. శుక్రవారం మండల స్థానిక ఎంపీడీఓ ప్రధానోపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ గావుడె హనుమంతు మాట్లాడుతు విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని, మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలన్నారు. ఇందులో కౌటాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు నారాయణ సింగ్, పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

నిషేధిత బెల్లం వాహనం పట్టివేత

చింతలమానెపల్లి : మండలంలోని లంబాడిహెట్టి గ్రామంలో నాటుసారాయి తయారీదారులకి బెల్లం, పటిక అక్రమంగా రవాణా చేస్తున్నారన్న సమాచారం మేరకు వాహనాలు తనిఖీ చేయగా ట్రాలీ ఆటోలో 630 కిలోల బెల్లం, 10 కిలోల పటిక, 20 లీటర్ల నాటుసారాయి గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు కాగజ్‌నగర్ ఎక్సైజ్ సీఐ వి.రవి తెలిపారు. అదే గ్రామానికి చెందిన చెందిన అజ్మీర కరుణ, ఈస్గాంకు చెందిన సాయి, రమేష్, బుడే వేణు పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడులలో ఎక్సైజ్ ఎస్సైలు ఐ.సురేష్, పి.రాజేశ్వర్ పాల్గొన్నారు.

హెల్త్ కార్డు కోసం దరఖాస్తుకు అవకాశం

నవతెలంగాణ-రెబ్బెన

పదవి విరమణ పొంది ఇప్పటి వరకు (సీపీఆర్‌ఎంఎస్) హెల్త్ కార్డు లేని విశ్రాంత ఉద్యోగులకు దరఖాస్తు చేసుకోవడానికి యాజమాన్యం అవకాశం కల్పించిందని బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఎం.శ్రీనివాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మార్చి నెల 31 వ తేదీ లోగా సంబంధిత గనులు, విభాగాల్లో దరఖాస్తులు అందజేయాలని కోరారు. కట్టాల్సిన డీడీ డబ్బులు, చికిత్స వ్యయం పై వస్తున్న వదంతులను నమ్మవద్దని అన్నారు. ఇందు కోసం ఉద్యోగి, జీవిత భాగస్వామి, నామినివి ఐదేసి ఫొటోలు, మూడేసి ఆధార్‌కార్డులు, పేరు తొలగింపు మెమో మూడు జిరాక్స్‌లు అవసరం అవుతాయని, ఎస్‌బీఐ కలెక్ట్‌లో రూ.60 వేల చెల్లించి డీడీ తీసుకోవాలని పేర్కొన్నారు. కుటుంబంలో వికలాంగులుంటే ఒకరి రూ.20 వేల డీడీ తీయాల్సి ఉంటుందన్నారు.

గంగాపూర్ జాతరకు ఆహ్వానపత్రం అందజేత

నవతెలంగాణ-రెబ్బెన

మండలంలోని గంగాపూర్ గ్రామం శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో ప్రతి ఏడాది 3 రోజుల పాటు జరిగే వార్షిక జాతర ఈ నెల 11,12,13 తేదీలలో నిర్వహిస్తున్నారు. కుమురం భీం జిల్లాలోనే ప్రసిద్ధి చెందిన జాతరలలో గంగాపూర్ ఒకటి. కాగా జాతర సందర్భంగా శుక్రవారం బెల్లంపల్లి ఏరియా సింగరేణి జీఎం ఎం.శ్రీనివాస్‌కి స్థానిక నాయకులు ఆహ్వాన పత్రిక అందజేశారు. ఇందులో గుడి చైర్మెన్ లెండుగురే జయరాం, ఐఎన్‌టీయూసీ నాయకులు పేరం శ్రీనివాస్, ప్రకాష్, ఆలయ డైరెక్టర్ దుప్ప నాయక్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు మోడెం సుదర్శన్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు మోడెం చిరంజీవి గౌడ్, లావుడ్యా పల్లాస్, లెండుగురే, గంటుమేర, గోగర్ల రాజేష్, గుంపుల విమలేష్, బొంగు నర్సింగ రావు, జిల్లాల స్వామి పాల్గొన్నారు.

'ప్రీ క్రిస్మస్ డబ్బులు ఇవ్వకుండా జాప్యం చేస్తున్నారు'

- కాగజ్‌నగర్ తహసీల్దార్‌పై ఫిర్యాదు



నవతెలంగాణ-కాగజ్‌నగర్

రాష్ట్ర ప్రభుత్వం ప్రీ క్రిస్మస్ వేడుకల కోసం విడుదల చేసిన రూ. 2 లక్షలను ఇవ్వకుండా కాగజ్‌నగర్ తహసీల్దార్ కిరణ్‌కుమార్ జాప్యం చేస్తున్నారని మాజీ కౌన్సిలర్ బాల్క శ్యాంకుమార్ ఆరోపించారు. శుక్రవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత డిసెంబర్ నెలలో రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ప్రీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించిందని, దీనికి సంబంధించి రూ. 2 లక్షలను విడుదల చేయగా, ఆ మొత్తాన్ని ఇప్పటి వరకు తహసీల్దార్ కిరణ్‌కుమార్ నిర్వాహకులకు అందించలేదని అన్నారు. దీనిపై జిల్లా కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఇకనైనా తహసీల్దార్ ఆ మొత్తాన్ని నిర్వాహకులకు అందించాలని డిమాండ్ చేశారు.

గంగాపూర్ జాతరను విజయవంతంగా నిర్వహించాలి

- అదనపు కలెక్టర్ దీపక్ తివారి

నవతెలంగాణ-రెబ్బెన

మండలం గంగాపూర్‌లో ఈ నెల 11 నుంచి 13వ తేదీ వరకు నిర్వహించనున్న శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి జాతరను అధికారులు సమన్వయంతో కృషిచేసి విజయవంతం చేయాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. శుక్రవారం అదనపు ఎస్పీతో కలిసి జాతర ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా వాహనాల పార్కింగ్, భారీ కేడ్లు, తాగునీరు, తాత్కాలిక మూత్రశాలలు, మరుగుదొడ్లు, పారిశుద్ధ్యం, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా రక్షణ చర్యలతో పాటు పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. వైద్య శిబిరాలు, నిరంతర విద్యుత్ సరఫరా, ప్రత్యేక బస్సుల ఏర్పాట్లపై చర్యలు తీసుకోవాలని, అధికారులు తమకు కేటాయించిన విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలని తెలిపారు.

పంటలపై రైతులకు శిక్షణ

నవతెలంగాణ-కౌటాల

మండల కేంద్రంలోని రైతు వేదికలో విజయ వాహిని చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రైతులకు పంటలపై శిక్షణ ఇచ్చారు. కాలానుకుల వ్యవసాయ ఆధారిత జీవనోపాదులలో భాగంగా రైతు వేదికలో కౌటాల, ఆసిఫాబాద్, కెరమెరి రైతులకు పర్భని శక్తి జొన్న పంటపై చిరుధాన్యాల పై శిక్షణా ఇచ్చారు. జొన్న పంట వేసే ముందు నాణ్యమైన విత్తనాల ఎంపిక, భూమి చదును చేసే, విత్తనాలు విత్తే విధానం, పంటలకు సోకే వ్యాధులు, నివారణ చర్యలు, దిగుబడి పై ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రైస్ రీసెర్చ్ రిటైర్డ్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ హెడ్ డా.సుబ్బారావ్ వివరించారు. ఇందులో జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖల సమన్వయంతో పనిచేస్తున్నట్లు వీసీఎఫ్ ప్రోగ్రాం లీడ్‌వాసు తెలిపారు. ఇట్టి శిక్షణా కార్యక్రమంలో రైతులు, మండల వ్యవసాయ అధికారి ప్రేమలత, ఫౌండేషన్ ప్రోగ్రాం లీడ్ పద్మాకర్, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

మహిళలకు చట్టాలపై అవగాహన

నవతెలంగాణ-దహెగాం

అడిషనల్ ఎస్పీ ప్రభాకర్ రావు పర్యవేక్షణలో శుక్రవారం మండలంలోని ఇట్యాల జెడ్పీపీఎస్ పాఠశాలలో విద్యార్థులకు కాగజ్‌నగర్ డివిజన్ షీ టీం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా షీ టీం సభ్యులు రమాదేవి, సునీత మహిళలపై హింస, ఈవ్ టీజింగ్, సైబర్ నేరాలు, సామాజిక మాధ్యమాలైన ఫేస్ బుక్, వాట్సప్ వినియోగంలో జాగ్రత్తలపై వివరించారు. ఫోటోలు, వీడియోలు పోస్ట్ చేసే సమయంలో వ్యక్తిగత భద్రత తీసుకోవాలన్నారు. సైబర్ నేరాలకు 1930, అత్యవసర సమయంలో డయల్ 100కు, ఇతర సమస్యలకు షీ టీం కాగాజ్ నగర్ ఫోన్ నం. 8712670565ను సంప్రదించాలని సూచించారు. ఇందులో హెచ్‌ఎం వీర శంకర్, సిబ్బంది, శ్రీనివాస్ పాల్గొన్నారు.



విగ్రహ ప్రతిష్ఠాపనలో ఎమ్మెల్యే వివేక్

నవతెలంగాణ-మందమర్రి



విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవంలో ఎమ్మెల్యే వివేక్ హాజరయ్యారు. దుబ్బపల్లి గ్రామంలో నూతనంగా నిర్మాణం చేపట్టిన ఆలయంలో ధ్వజస్తంభన, శ్రీ రమా సమేత సత్యనారాయణ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి హాజరయ్యారు. ఆలయ కమిటీ సభ్యులు పూర్ణ కుంభంతో వారికి ఘనంగా స్వాగతం పలికారు. సత్యనారాయణ స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఉపేందర్ గౌడ్, మండల ఇన్‌చార్జి కడారి జీవన్ కుమార్, సీనియర్ నాయకులు సొతుకు సుదర్శన్, మంద తిరుమల్ రెడ్డి, బండి సదానందం, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

రిక్రూట్మెంట్ ఫౌండేషన్ కోర్సులకు ఉచిత శిక్షణ

నస్పూర్ : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీలలో డిగ్రీ ఉత్తీర్ణులైన అభ్యర్థులకు ఆర్ఆర్‌బీ, ఎస్ఎస్‌సీ, బ్యాంకింగ్ రిక్రూట్మెంట్ ఫౌండేషన్ కోర్సులు ఉచితంగా అందిస్తారని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి ఎ పురుషోత్తం, బీసీ స్టడీ సర్కిల్-ఆదిలాబాద్ సంచాలకులు జి ప్రవీణ్ కుమార్ ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ఫిబ్రవరి 15వ తేదీ నుండి 4 నెలల ఉచిత శిక్షణ ప్రారంభించడం జరుగుతుందని, అభ్యర్థులకు బుక్ ఫండ్, ప్రతి నెల స్టైఫండ్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. తల్లిదండ్రుల ఆదాయం గ్రామీణ ప్రాంతాలలో రూ.1 లక్షా 50 వేలు, పట్టణ ప్రాంతాలలో రూ.2 లక్షలలోపు ఉండాలని, అభ్యర్థుల ఎంపిక విధానం రూల్ ఆఫ్ రిజర్వేషన్, ఇంటర్మీడియట్, డిగ్రీ పరీక్షలలో వచ్చిన మార్కుల ఆధారంగా ఉంటుందని తెలిపారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులకు ఈ నెల 9వ తేదీ లోగా ఆన్‌లైన్‌లో టీజీబీసీఎస్‌టీయూడీవైసీఐఆర్‌సీఎల్‌ఈ.సీజీజీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, ఈ నెల 12 నుండి 14వ తేదీ వరకు ధ్రువపత్రాల పరిశీలన ఉంటుందని తెలిపారు. ఇతర వివరాలకు 08732-221280 నంబర్‌లో సంప్రదించవచ్చని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

విగ్రహ ఏర్పాటుకు స్థలం కేటాయించండి

- తహసీల్దార్‌ను కలిసిన బీఆర్ఎస్ నాయకులు



నవతెలంగాణ-జైపూర్

మండల కేంద్రంలో మహాత్ముల విగ్రహాలు ప్రతిష్ఠించేందుకు అనువైన స్థలం కెటాయించాలని స్థానిక బీఆర్ఎస్ నాయకులు కోరారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ వనజారెడ్డిని కలిసిన నాయులు వినతీ పత్రం అందజేశారు. సబ్బండ వర్గాలకు ఎనలేని సేవలందించిన మహాత్మ జ్యోతిబా పూలే, సావిత్రి బాయిల విగ్రహాలు మండల కేంద్రంలో ప్రతిష్ఠించాల్సిన అవసరమని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతిబాపూలే, సావిత్రి భాయి విగ్రహాల ప్రతిష్టకు మండల కమిటీ నిర్ణయించిందని తెలిపారు. మహానీయుల విగ్రహాల ప్రతిష్టకు ప్రభుత్వ పరంగా అనువైన స్థలం కెటాయించాల్సిన అవసరమని అన్నారు. తహసీల్దార్‌ను కలిసిన వారిలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బలమూరి అరవిందరావు, రామటెంకి లింగస్వామి, ఆసంపల్లి రాజమల్లు, అర్నె సమ్మయ్య, జాడి ఏసయ్య పాల్గొన్నారు.

సైబర్ నేరాలపట్ల అప్రమత్తంగా ఉండాలి



నవతెలంగాణ-జన్నారం

సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సెల్ ఫోన్‌లోకి వచ్చే ఓటీపులు ఎవరికి చెప్పవద్దని, ఎస్ఐ రాథోడ్ సురేష్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని బస్టాండ్ ఎదుట ఆయన వాహనదారులకు, ప్రజలకు అవగాహన కల్పించారు. మొబైల్ ఫోన్లకు గుర్తు తెలియని ఓటీపీలు వస్తే ఎవరికి చెప్పవద్దన్నారు. చిన్నపాటి నిర్లక్ష్యమే కొంపముంచుతుందన్నారు. ద్విచక్ర వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. ట్రిపుల్ రైడ్ చేయవద్దని, రోడ్డు భద్రత నియమాలు పాటించాలన్నారు. కార్యక్రమంలో పోలీసులు శ్రీనివాస్ పాల్గొన్నారు.

షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నర్సింగ్

నవతెలంగాణ-నస్పూర్



తెలంగాణ షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్‌కు చెందిన జింజుపెల్లి నర్సింగ్‌ను నియమిస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు ఎం కమలాకర్ తెలిపారు. శుక్రవారం కరీంనగర్‌లో తెలంగాణ షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు మాట్లాడుతూ సంఘం బలోపేతం కోసం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న షెడ్యూల్ కులాలను ఐక్యం చేస్తూ, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరికి అందేలా పనిచేయాలని సంఘంలో ప్రతి ఒక్కరు సమిష్టిగా కృషి చేయాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా సంఘం విస్తరించడం, బలోపేతం చేయడం కోసం గతంలో విద్యార్థి యువజన ప్రజా పోరాటాలలో కీలకపాత్రను పోషించి ఉమ్మడి రాష్ట్రానికి నాయకత్వం వహించిన నర్సింగ్‌కు నియామక పత్రాలు అందజేశారు. అనంతరం నర్సింగ్ మాట్లాడుతూ నా పై విశ్వాసంతో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర అధ్యక్షుడు కమలాకర్‌కు ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలోని షెడ్యూల్డ్ కులాల సంఘం నిర్మాణం బలోపేతం కోసం నిరంతరం కృషి చేస్తానని అన్నారు.

తల్లిదండ్రులు పిల్లలను తప్పక పాఠశాలకు పంపాలి



నవతెలంగాణ-జన్నారం

తల్లిదండ్రులు తమ పిల్లలను క్రమం తప్పకుండా ప్రతిరోజు పాఠశాలలకు పంపాలని ఎంఈఓ విజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని పొన్కల్ గ్రామంలో పాఠశాలకు హాజరు కానీ పిల్లల ఇండ్లకు వెళ్లి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. పిల్లలు సక్రమంగా పాఠశాలకు వస్తేనే మంచి ఉత్తీర్ణత సాధిస్తారన్నారు. తప్పకుండా విద్యార్థులను ప్రతిరోజు పాఠశాలకు పంపాలని కోరారు. కార్యక్రమంలో ఏఎస్ఐ సురేష్, కానిస్టేబుళ్ల శ్రీనివాస్, రమేష్, సీఆర్‌పీ దయాకర్ పాల్గొన్నారు.

మండల ప్రత్యేక అధికారి బాధ్యతల స్వీకరణ

నవతెలంగాణ-కాసిపేట



మండల ప్రత్యేక అధికారిగా శుక్రవారం పురుషోత్తం నాయక్ బాధ్యతలను స్వీకరించారు. జిల్లా అడల్ట్ ఎడ్యుకేషన్ ప్రాజెక్ట్ ఆఫీసర్ అజ్మీర పురుషోత్తం నాయక్ మండల ప్రత్యేక అధికారిగా పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మండల పరిషత్ అధికారులు శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీఈఓ గణపతి, ఎంపీడీఓ సత్యనారాయణ సింగ్, ఎల్డీఎం తిరుపతి, ఎంపీఓ శేక్ సఫ్దర్ అలీ, సీనియర్ సహాయకులు ఆకుల లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

'చెత్త' వివాదం..!

- దంపింగ్ యార్డుతో స్థానికుల ఆందోళన
- కలెక్టర్ ఆదేశాలంటున్న మున్సిపాలిటీ అధికారులు



నవతెలంగాణ-కాసిపేట

ప్రజారోగ్యాన్ని కాపాడల్సిన మున్సిపల్ అధికారులు చెత్తను జనావాసాల్లో డంపు చేసి వివాదానికి తెరలేపారు. బెల్లంపల్లి మున్సిపాలిటి పరిధిలో సేకరించిన చెత్త చెదారాన్ని మండలంలోని పెద్దనపల్లి గ్రామ పంచాయతీ ఓపెన్ కాస్ట్ క్యాంప్ ఆఫీస్ సమీపంలో సింగరేణి స్థలంలో పోస్తుండటంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బెల్లంపల్లి చెత్తను కాసిపేటకు పంపించడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. బెల్లంపల్లి మున్సిపాలిటి పరిధిలోని పలు వార్డులు, గ్రామాల నుంచి సేకరించిన చెత్తను రైల్వే స్టేషన్, సోమగూడెం మీదుగా 10కిలో మీటర్ల దూరంలోని బ్రిడ్జి సమీపంలో పోస్తున్నారు. సోమగూడెం కాసిపేట ప్రధాన రహదారి పక్కనే పెద్దనపల్లికి వెళ్లే రోడ్డుకు కుడివైపున బ్రిడ్జి సమీపంలో చెత్తను డంప్ చేయడం వివాదంగా మారుతుంది. రోజుకు పదుల సంఖ్యలో వాహనాలు వందల సంఖ్యలో ట్రిప్పులు వేస్తున్నాయి. కేకే ఓసీలో కాంట్రాక్టు విధులు నిర్వహించే కార్మికుల క్యాంపు ఆఫీస్ చెత్తపోసి చోటుకు 200 మీటర్ల దూరంలో ఉంది. అక్కడ సుమారు వంద మంది వరకు నివాసం ఉంటున్నారు. దుర్వాసన వస్తోందని సోమగూడెం, దుబ్బగూడెం గ్రామస్తులు చెత్త తరలించే ట్రాక్టర్ డ్రైవర్లతో వాదనకు దిగడంతో చెత్త కింద పడకుండ వెనకల పరదలు కట్టి తరలిస్తున్నారు. ఇటీవల సోమగూడెం వద్ద ట్రాక్టర్లను అడ్డుకోని ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ ప్రవీణ్ కుమార్ సంఘటన స్థలానికి చేరుకుని మున్సిపల్ కమిషనర్‌ను సంప్రదించగా కలెక్టర్ ఆదేశాలమేరకే చెత్తను తరళిస్తున్నామని తెలపడంతో ఎస్ఐ అక్కడి నుంచి వెళ్లిపోయారు.

చెత్త తగల పెట్టడంతో కిలోమీటర్ మేర దుర్వాసన

వందల సంఖ్యలో ట్రాక్టర్లలో తరలించిన చెత్తను గురువారం తగల పెట్టడంతో కిలోమీటర్ మేర దుర్వాసన వచ్చింది. తడి పోడి చెత్తతో పాటు పలు మెడికల్ వ్యర్థాలు ఉండటంతో స్థానికులు భయాందోళనలకు గురయ్యారు. పక్కనే క్యాంపులో వంద మంది వరకు కంట్రాక్టు కార్మికులు నివాసం ఉంటున్నారు. కొద్ది పాటి గాలి వీచిన దుర్వాసన వస్తుందని వాపోతున్నారు. ప్రధాన రోడ్డుకు సమీపంలో చెత్తను పోయడం తగల పెట్టడం ఏంటని ఎక్కడైన దూరప్రాంతాలకు చెత్తను తరలించాలని మండల వాసులు కోరుతున్నారు.

కలుషిత నీటితోనే డైయేరియా వ్యాప్తి

- చెన్నూర్ ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేసిన ఎమ్మెల్యే వివేక్



నవతెలంగాణ-జైపూర్

చెన్నూర్ పట్టణంలో డయేరియా కలుషిత నీటితోనే వ్యాప్తి చెందుతుందని స్థానిక ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. పట్టణంలో గల ప్రభుత్వ ఆస్పత్రిని స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి శుక్రవారం అకస్మికంగా తనిఖీ చేశారు. డయేరియాతో బాధపడుతూ ఆసుపత్రిలో చేరిన రోగులను కలిసి పరమార్శించారు. ఆసుపత్రిలో చేరిన రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. కాగా మున్సిపాలిటీ పరిధిలో తాగు నీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణంలో గల బట్టిగూడెం, జెండావాడలో మిషన్ భగీరథ ద్వార తాగు నీరు అందిస్తున్నామని తెలిపారు. ఇటీవల జరుపుకున్న బోనాల జాతరతో తాగు నీరు కలుషితమైందని, ఫలితంగా వాంతులు, విరోచనాలతో ప్రజలు బాధపడుతున్నారని తెలిపారు. బతుకమ్మ వాగు నుండి కాకుండా గోదావరి నీళ్ల సరఫరా చేస్తున్నామని తెలిపారు. అమృత్ పథకం ద్వార నీళ్ల అందించేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి అవసరమైన నిధులు విడుదల చేయడంతో పాటు సమస్యలకు శాశ్వత పరిష్కారం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

కిడ్స్ ప్లే జోన్ ప్రారంభించిన ఎమ్మెల్యే

చెన్నూర్ పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన కిడ్స్‌ప్లే జోన్‌ను ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం స్థానిక లక్ష్మిదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఓంకార ఆధ్య అనే బాలిక వైద్య సేవల నిమిత్తం రూ. 1.5 లక్షల ఎల్‌ఓసీ కుటుంబ సభ్యులకు అందజేశారు. అనంతరం స్థాని బీఎంఆర్ గార్డెన్స్‌లో బీజేపీ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు వెంకటేశ్ గౌడ్ కూతరు వివాహ వేడుకల్లో పాల్గొన్నారు.

భీమారం మండల కేంద్రంలో పార్క్ ఏర్పాటు చేయాలి

భీమారం మండల పరిధి గ్రామీణ ప్రాంతాల వారి సమస్యలు పరిష్కరించాలని స్థానిక కాంగ్రెస్ నాయకుడు వేల్పుల శ్రీనివాస్ కోరారు. ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామిని క్యాంపు కార్యాలయంలో కలిసిన ఆయన గ్రామీణ ప్రాంతాల్లో సీసీ రోడ్ల నిర్మాణంతో పాటు డ్రైనేజీల నిర్మాణం త్వరగా చేపట్టాలని కోరారు. అదేవిధంగా మండల కేంద్రంలో పార్క్ ఏర్పాటు విషయమై ఆయన ఎమ్మెల్యే దృష్టికి తీసుకుపోయారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమై స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరినట్లు తెలిపారు.

టాలెంట్ టెస్ట్ నిర్వహించడం అభినందనీయం

- సెక్టోరల్ అధికారులు సత్యనారాయణమూర్తి, యశోధర

నవతెలంగాణ-లక్షెట్టిపేట

సత్యసాయి సేవా సంస్థలు లక్షెట్టిపేట జోన్ ఆధ్వర్యంలో 4 మండలాలు హాజీపూర్, లక్షెట్టిపేట, దండేపల్లి, జన్నారంలోని పదవ తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఇందులో 42 పాఠశాలల నుంచి 126 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యాశాఖ సెక్టోరల్ అధికారులు సత్యనారాయణ మూర్తి, యశోధర, మాట్లాడుతూ విద్యార్థులకు పదవ తరగతి పరీక్షలు సమీపిస్తున్న ఈ తరుణంలో ఈ టాలెంట్ టెస్ట్ నిర్వహించడం అభినందనీయమని, ఈ టెస్ట్ ద్వారా విద్యార్థుల స్థాయిని తెలుసుకొని చేసిన పొరపాటును సరిదిద్దుకొని అధిక మార్కులు సంపాదించడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. విద్యార్థులు ఇలాంటి పరీక్షలకు హాజరు కావడం వలన ఒత్తిడికి గురి కాకుండా ఉండేందుకు అవకాశం ఉంటుంది అని తెలిపారు. ఈ పరీక్షలో ప్రథమ విజేతకు రూ.3000, రెండవ స్థానంలో నిలిచిన విద్యార్థికి రూ.2000, మూడవ స్థానంలో ఉన్న విద్యార్థికి ఒక వెయ్యి రూపాయల చొప్పున అందజేస్తూ జ్ఞాపికలను కూడా అందజేశారు. ఈ కార్యక్రమంలో లక్షెట్టిపేట, దండేపల్లి మండల విద్యాధికారులు చిన్నయ్య, హెలెన్ డారతి, సత్య సాయి సేవ సంస్థల జిల్లా సమన్వయకర్తలు పాపిరెడ్డి వెంకటేశ్వర్లు, రత్నాకర్, పదాధికారి కొత్త వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



విద్యా వ్యవస్థను బలోపేతం చేయడమే లక్ష్యం



నవతెలంగాణ-జైపూర్

విద్యా వ్యవస్థను బలోపేతం చేయడమే ప్రభుత్వం లక్ష్యమన్ని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. భీమారం మండల కేంద్రంలోని కస్తూరిభా గాంధీ బాలికల పాఠశాల, పోతన్‌పల్లి గ్రామంలో మండల పరిషత్ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, నర్సింగాపూర్ జిల్లా పరిషత్ పాఠశాలను శుక్రవారం సందర్శించారు. తరగతి గదులు, వంటశాల, మధ్యాహ్నభోజనం, నిత్యావసర వస్తువుల నిల్వలు, రికార్డులు, పరిసరాలు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు సౌకర్యాలతో కూడిన నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. ఈ క్రమంలో అమ్మ ఆదర్శపాఠశాలల కమిటీల ఆధ్వర్యంలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో కనీస మౌళిక వసతులైన తాగు నీరు, విద్యుత్, మూత్రశాలు, ప్రహరి గోడల ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ మెను చార్జీలు పెంచి నూతనంగా మెను అమలు చేస్తున్నామని తెలిపారు. వార్షిక పరిక్షలు సమీపిస్తున్నందున విద్యార్థులు పాఠ్యాంశాలను పూర్తి చేసి సిద్ధంగా ఉండాలని సూచించారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని, తరగతిలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలలో విద్యార్థుల సంఖ్యాం పెంపొందించే విధంగా కృషి చేయాలని అన్నారు.

10న పీఎం నేషనల్ అప్రెంటిషిప్ మేళా

నవతెలంగాణ-జన్నారం

మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ ఐటీ కళాశాలలో పీఎం నేషనల్ అప్రెంటిషిప్ మేళాను నిర్వహించనున్నామని కళాశాల ప్రిన్సిపాల్ బండి రాములు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఫిబ్రవరి 10న తమ కళాశాలలో అప్రెంటిషిప్ మేళ ఉంటుందన్నారు. ఆసక్తిగల ఐటీఐ కంప్లీట్ చేసిన అభ్యర్థులు బయోడేటా ఫామ్, ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో హాజరు కావాలని ఆయన సూచించారు. పెన్నార్ ఎలక్ట్రికల్స్, రానే ఇంజన్ వాల్స్, తదితర కంపెనీలో శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించడం జరుగుతుందని తెలిపారు. అవకాశాన్ని అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ వేసుకోవాలి



నవతెలంగాణ-జైపూర్

పిల్లలకు సంక్రమించే నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్ర వేయించాలని స్థానిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు ముస్తఫా తెలిపారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జాతీయ నులిపురుగుల నివారణ వారోత్సవాలపై ఎంపీడీఓ సత్యనారాయణ వైద్యాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ నెల 10 నుండి 17 వరకు మండల పరిధిలో నులి పురుగు నివారణ వారోత్సవాలు జరుపుకోనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ అధికారుల, స్వచ్చంద సేవా సంఘాలు సహకరించాలని కోరారు. 1 నుండి 19 సంవత్సరాల వయస్సుగల పిల్లలందరికి నులి పురుగు నివారణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. పిల్లల్లో రక్తహీనత, పోషకాహార లోపం, ఆకలి లేకపోవడం, బలహీణత, కడుపు నొప్పి, విరోచనాలు, బరువు తగ్గడం వంటి అనేక అనారోగ్య సమస్యలను కలిగిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంఈఓ శ్రీనివాస్, డిస్ట్రిక్ కోఆర్డినేటర్ నాందేవ్, హెచ్ఈఓ సతీష్, హెచ్ఎస్ జ్యోతి, ఏఎన్ఎం ఉమాదేవి, మల్లేశ్వరి పాల్గొన్నారు.

గ్రామాల్లో కొనసాగుతున్న క్రాప్ డిజిటల్ సర్వే

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని పలు గ్రామాల శివారులలో క్రాప్ డిజిటల్ సర్వే కొనసాగుతోంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని రాంపూర్ తిమ్మాపూర్ సింగరాయిపేట తపాలాపూర్ గ్రామ శివారులో రైతుల పొలాల్లో వేసిన పంటలను గుర్తింపునకు సింగరాయపేట క్లస్టర్ ఏఈఓ సాయి శుక్రవారం డిజిటల్ సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పలువురు రైతుల పొలాలకు వెళ్లి అక్కడ వేసిన పంటలను ఫోటో తీసి ఆన్లైన్లో నమోదు చేశారు. పంటల నమోదు ప్రక్రియ డిజిటల్ సర్వే రూపంలో నిర్వహిస్తున్నామని తెలిపారు.

ఒప్పందాలను అమలు చేయాలి



నవతెలంగాణ-జైపూర్

సింగరేణి థర్మల్ పవర్‌ప్లాంట్ కాంట్రాక్టు కార్మికులకు సంబంధించిన సమస్యలపై ఎస్టీపీపీ యాజమాన్యం అంగీకరించిన పలు ఒప్పందాలను ప్లాంట్ నిర్వాహణ బాధ్యతలు చేపట్టన పవర్‌మేక్ కంపెనీ అమలు చేయాలని బీఎంఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఎస్టీపీపీ కార్మికుల సమస్యలు, హక్కుల విషయమై 2024 డిసెంబర్ 17న డిప్యూటీ సీఎల్‌సీ ఆధ్వర్యంలో ఎస్టీపీపీ యాజమాన్యం పలు ఒప్పందాల అమలుకు అంగీకరించిన విషయమై శుక్రవారం ఎస్టీపీపీ ఈడీ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. పవర్‌మేక్ కంపెనీ కార్మికుల సమస్యల పట్ల నిర్లక్ష్యం చేస్తుందని వివరించారు. అదేవిధంగా ప్లాంట్ పరిధిలో ఏహెచ్‌పీ హౌస్ కీపింగ్ విభాగంలో పని చేస్తున్న చాంద్‌పాష ఆధార్ కార్డులో గత పొరపాట్లు సాకుగా చూపించిన పవర్‌మేక్ కంపెనీ చాంద్ పాషను విధుల నుండి తొలగించిందని తెలిపారు. ఈ విషయమై స్పందించిన డిప్యూటీ పర్సనల్ మేనేజర్ తుకరాం స్పందిస్తూ పవర్‌మేక్ కంపెనీతో మాట్లాడి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇవ్వడంతో పాటు విధుల నుండి తొలగించిన చాంద్‌పాషను విధుల్లోకి తీసుకునేవిధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

వ్యాధి సోకిన కుక్కలే మృతి

నవతెలంగాణ-తాండూర్

తాండూర్ మేజర్ గ్రామపంచాయతీలో వీధి కుక్కలను తరలించే క్రమంలో వ్యాధి సోకిన కుక్కలే మృతి చెందాయని మత్తుమందు ఇచ్చి చంపారన్న దానిలో నిజం లేదని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ఎండీ ఈసా, మాజీ ఎంపీపీ సిరంగి శంకర్ తెలిపారు. శుక్రవారం తాండూర్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం వారు మాట్లాడారు. ప్రజా వానిలో పలుమార్లు వచ్చిన ఫిర్యాదులు ప్రజల అభిప్రాయం మేరకే టామ్ టామ్ నిర్వహించి గ్రామపంచాయతీలో వీధి కుక్కల నిర్మూలనకు ఎంపీడీ చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. వీధి కుక్కలన్నింటికీ మత్తుమందు ఇచ్చి అడవికి తరలించే క్రమంలో కొన్ని వ్యాధి బారిన పడ్డ కుక్కలు మత్తుమందు వికటించి మృతి చెందాయని తెలిపారు. ఇది ఉద్దేశపూర్వకంగా జరిగిన సంఘటన కాదని అన్నారు. ఈ విషయాన్ని తాండూర్ గ్రామ పంచాయితీ ప్రజల అభిప్రాయం మేరకు పత్రికాముఖంగా వెల్లడించడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో యూత్ అధ్యక్షుడు పట్టెం విష్ణు, కళ్యాణ్, మంతెన శివకృష్ణ, ముస్కె సాగర్, కేశెట్టి సంతోష్, ఆగిడి సంతోష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకులకు ఎమ్మెల్యే పరామర్శ

నవతెలంగాణ-జైపూర్

మండలంలోని టేకుమట్ల గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు, మాజీ ఎంపీపీ నడిపెల్లి సత్యనారాయణ రావును శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి పరమార్శించారు. రోడ్డు ప్రమాదంలో ఇటీవల గాయపడిన సత్యనారాయణ రావును మంచిర్యాలలో ఆయన నివాసంలో కలిసి ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అదేవిధంగా భీమారం మండల కేంద్రానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు చేకుర్తి సత్యనారాయణరెడ్డిని కలిశారు. చర్మ సంబంధిత శస్త్ర చికిత్సలు చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్న సత్యనారాయణరెడ్డి ఆరోగ్య స్థితిగతులపై ఆరా తీశారు. ఆత్మ స్థైర్యంతో మెరుగైన వైద్య సేవలు పొంది త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.



విద్యార్థులందరూ ప్రభుత్వ కళాశాలల్లో చేరాలి

నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

మండలంలోని అనంతపేట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు శంకర్, ఇతర అధ్యాపకులు శుక్రవారం సందర్శించారు. పదో తరగతిలో ఉత్తీర్ణత



అనంతరం ప్రతి ఒక్క విద్యార్థి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరాలని సూచించారు. అనుభవజ్ఞులైన అధ్యాపకుల చేత బోధన, ఉచితంగా పుస్తకాలు పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. విద్యార్థులు ప్రభుత్వ కళాశాలలకు మాత్రమే ఆసక్తి చూపాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్

గర్భిణులు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-నార్నూర్

గర్భిణుల కోసం నిర్వహించే వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని పీహెచ్‌సీ డాక్టర్ రాంబాబు సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో గర్భిణుల వైద్యమందించారు. మండలంలోని గుంజాల సబ్ సెంటర్ పరిధిలోని ఉన్న 25 మంది గర్భిణులకు రక్త పరీక్ష, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఐరన్, గ్లూకోస్, ఇంజక్షన్, మందులు పంపిణీ చేశారు. వైద్య శిబిరంలో హెల్త్ సూపర్‌వైజర్ చౌహాన్ చరణ్‌దాస్, పీహెచ్ఎన్ఓ సుశీల, వైద్య సిబ్బంది హిమ బిందు, మాన్యుబాయి, ఉషారాణి, గోకుల్, అజయ్, రాథోడ్ సచిన్ ఉన్నారు.



100 రోజుల టీబీ కార్యక్రమంపై అవగాహన



నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

మండలంలోని అంకోలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో శుక్రవారం బంగారుగూడ మైనారిటీ రెసిడెన్షియల్ బాలికల పాఠశాలలో టీబీ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ క్యాంపును డీఎంహెచ్ఓ డాక్టర్ నరేందర్ రాథోడ్ సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ టీబీపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎక్స్‌రే వాహనంలో గ్రామంలోని ప్రజలకు ఎక్స్‌రే తీసినట్టు మరియు కళ్లే స్పుటం కంటేనర్లు ఇచ్చినట్టు అక్కడే పరీక్షలు నిర్వహించడం జరిగిందన్నారు. మొత్తం టీబీ టెస్టులు 276 ఎక్స్‌రే 83 తీయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో డా.సర్ఫరాజ్, డా.కృష్ణవేణి, సూపర్‌వైజర్ శకుంతల, ఆరోగ్యకార్యకర్తలు జి.శ్రీదేవి, నల్ల ఈశ్వర్ రెడ్డి, పవార్ ప్రేమ్‌సింగ్, ల్యాబ్ టెక్నీషియన్ సమి, ఆశాకార్యకర్తలు రాధ, గంగమ్మ, పుష్ప, గంగమ్మ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పట్టుదల, క్రమశిక్షణ ఉంటే విజయం సొంతం



నవతెలంగాణ-ఖానాపూర్

క్రమశిక్షణ, పట్టుదల ఉంటే విజయం సొంతమవుతుందని ఇంపాక్ట్ ఇంటర్నేషనల్(మోటివేషనల్ స్పీకర్ అండ్ ట్రైనర్), ఐసిఐ ఆదిలాబాద్ ప్రెసిడెంట్ అల్లుట్ల రాజశేఖర్ అన్నారు. శుక్రవారం ఎల్లాపూర్ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో 8, 9, 10వ తరగతి విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు సమయపాలన, పరీక్షలపై భయం, మొబైల్ ఫోన్ ఎక్కువగా వాడటం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థుల్లో మనోధైర్యాన్ని నింపారు. విద్యార్థులు అన్ని రంగాల్లో నైపుణ్యం పొంది ఉన్నత శిఖరాలు అధిరోహించాలని, కష్టంగా కాకుండా ఇష్టంగా చదవాలన్నారు. సమయాన్ని వృథా చేసుకోకుండా సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఆసూరి రమాదేవి, ఉపాధ్యాయులు శ్రీనివాస్, తిరుమల, రవీందర్‌రెడ్డి, సుదర్శన్, మల్లేష్, శంకర్, రాణి, సీమ నూర్జహా, శంకర్ పాల్గొన్నారు.

ఆచారాలు పద్ధతులను భావితరాలకు అందించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సనాతన ధర్మం, ఆచారాలు పద్ధతులను భవితరాలకు అందించాలని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. శుక్రవారం వార్డు నెంబర్ 12 పరిధిలోని శ్రీనగర్ కాలనీలో నిర్మించే శ్రీరాధకృష్ణ ఆలయానికి ఆయన భూమిపూజ చేశారు. వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ ఈ క్రతువును నిర్వహించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జోగు రామన్నను కాలనీవాసులు సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం వచ్చిన తరువాత ఆధ్యాత్మిక భావాలు కలిగిన వ్యక్తి కేసీఆర్ సీఎం అయ్యారని అన్నారు. తరువాత ఏ రాష్ట్రంలో సీఎం చేయని విధంగా యాగాలు, యజ్ఞలు చేశారని తెలిపారు. ప్రజలు కూడా హైందవ ధర్మాన్ని పరిరక్షిస్తునే భావితరాలకు మన అచరాలు, సంస్కృతి, పద్ధతులను తెలియజేయాలన్నారు. ఆలయ నిర్మాణానికి తన వంతుగా పూర్తి సహకారం అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ పవన్ నాయక్, కాలనీ అధ్యక్షుడు లక్ష్మణ్, సంతోష్, విజయ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు



నవతెలంగాణ-తాండూర్

రాజీవ్ నగర్ పంచాయతీలోని కొత్తపెల్లి, తాండూర్ శివారులో అక్రమ నిర్మాణాలు చేపడితే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్ తెలిపారు. ఆయన శుక్రవారం రాజీవ్‌నగర్ పంచాయతీలో రోడ్లపై అక్రమంగా నిర్మించిన నిర్మాణాలను తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా రాజీవ్ నగర్ పంచాయతీ పరిధిలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నట్టు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. వ్యవసాయ భూముల్లో గ్రామపంచాయతీ నిర్మాణ అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే చట్ట ప్రకారం కఠినమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఆయనతో ఆర్ఐ ఎజాజోద్దీన్, పంచాయతీ కార్యదర్శి, రమాదేవి పోలీస్‌శాఖ సిబ్బంది ఉన్నారు.

హోదాను మార్పు చేస్తూ త్వరలో ఉత్తర్వులు



నవతెలంగాణ-నస్పూర్

సింగరేణిలో పనిచేస్తున్న బదిలీ వర్కర్ జనరల్ మజ్దూర్ కార్మికుల హోదాను మార్పు చేస్తూ జనరల్ అసిస్టెంట్‌గా త్వరలోనే ఉత్తర్వులు వెలువడనున్నాయని సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య అన్నారు. శుక్రవారం శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షుడు నాతాడి శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. సింగరేణి పరిశ్రమలో బదిలీ వర్కర్ జనరల్ మజ్దూర్ అనే హోదా సింగరేణి పరిశ్రమ చరిత్రలో ఏండ్ల తరబడి సామాజిక అసమానతలకు గురవుతూ, సామాజికంగా సమాజంలో చిన్న చూపు చూడబడ్డారని పేర్కొన్నారు. కార్మిక బస్తీలలో కూడా తోటి కార్మికులతో అనేక అవస్థలు పడుతూ పిల్లలు చదువుకునే కార్పొరేట్ కాలేజీలలో సోషల్ స్టేటస్ పేరుతో కార్మికుని పిల్లలను అవమానపరుస్తూ జరుగుతున్న అసమానతను సింగరేణి పర్యటనలో గుర్తించిన బొగ్గు పరిశ్రమల ఇన్‌చార్జ్, సీఎంపీఎఫ్ ట్రస్ట్ బోర్డ్ సభ్యుడు కొత్తకాపు లక్ష్మారెడ్డి తెలిపారు. దాని ప్రకారం.. ఫిబ్రవరి 6న జైసల్మార్ రాజస్థాన్‌లో జరిగిన 2వ స్టాండర్డ్ డైజేషన్ కమిటీ సమావేశంలో స్టాండర్డ్ డైజేషన్ కమిటీ సభ్యులు సుధీర్ గురుడే, మజ్రుల్ హక్ అన్సారి, సింగరేణి నుంచి యాదగిరి సత్తయ్య సుదీర్ఘంగా కోల్ ఇండియా, సింగరేణి యాజమాన్యంతో చర్చించి బదిలీ వర్కర్ జనరల్ మజ్దూర్ హోదాను వెంటనే రద్దు చేస్తూ, పరిశ్రమలలో గౌరవప్రదమైన తోటి కార్మికులతో ఉండే విధంగా జనరల్ అసిస్టెంట్‌గా మారుస్తూ ఒప్పందం జరిగిందన్నారు. అయినప్పటికీ అమలుపై జాప్యం చేస్తున్న కోల్ ఇండియా యాజమాన్య ప్రతినిధులతో మాట్లాడి అమలు చేసే విధంగా ఆదేశాలు ఇవ్వాలని తెలిపినట్టు పేర్కొన్నారు. వెంటనే స్పందించిన కోల్ ఇండియా యాజమాన్యం ప్రతినిధులు అమలు చేయుటకు ఆదేశాలు త్వరలోనే జారీ చేస్తామని తెలిపారని అన్నారు. సింగరేణి వ్యాప్తంగా పనిచేస్తున్న బదిలీ వర్కర్ జనరల్ మజ్దూర్ కార్మికులు సంస్థ పుట్టిన నుంచి ఇప్పటివరకు స్పందించని కార్మిక సంఘాల వైఖరిని గమనించాలని విజ్ఞప్తి చేశారు. సింగరేణి వ్యాప్తంగా, సంస్థపరంగా సోషల్ స్టేటస్ పెంచుతూ గౌరవప్రదమైన హోదా చారిత్రాత్మకమైన మార్పు, ఒప్పందమని, గనులలో బదిలీ వర్కర్ జనరల్ మజ్దూర్ కార్మికులు సంబరాలు అంబరాన్ని అంటే విధంగా జరుపుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా కార్యదర్శి రాగం రాజేందర్, ఏరియా ట్రెజరర్ గూడ శ్రీకాంత్, జిల్లా తిరుపతి, కుంట రాజు, కిరణ్ కుమార్, రాజ్ కుమార్, కిషోర్, కిషన్, రామకష్ణ, రాజేందర్, విజయ్ కుమార్ పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వం వాటా రూ.5వేలు పెంచాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



వికలాంగుల పెన్షన్‌లో కేంద్ర ప్రభుత్వం వాటా రూ.5వేలకు పెంచాలని, బడ్జెట్‌లో 5శాతం నిధులు కేటాయించాలని, ఎన్పీఆర్డీ జిల్లా అధ్యక్షురాలు అరిఫ డిమాండ్ చేశారు. ఫిబ్రవరి 10న ఢిల్లీలో ఎన్‌పీఆర్డీ కేంద్ర కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న వికలాంగుల మహాధర్నాకు శుక్రవారం జిల్లా నుంచి నాయకులు పయనమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపుల్లో వికలాంగులకు అన్యాయం చేసిందని అన్నారు. పెన్షన్ పెంపు కోసం బడ్జెట్‌లో నిధులు కేటాయించకుండా మోసం చేసిందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అనేక పథకాలకు నిధులు కేటాయించకుండా ప్రభుత్వం తీవ్రమైన నిర్లక్ష్యం చేసిందని అన్నారు. మోడీ ప్రభుత్వం పాలనలో వికలాంగులు అభివృద్ధికి నోచుకోవడం లేదన్నారు. ఇందిరా గాంధీ నేషనల్ వికలాంగుల పెన్షన్ స్కీం వికలాంగులందరికి వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వరంగ సంస్థల్లో ఖాళీగా ఉన్నా వికలాంగుల బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు ఢిల్లీలో ధర్నా నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు పాల్గొన్నారు.

రమాబాయి అంబేద్కర్ జయంతి వేడుకలు



నవతెలంగాణ-లక్షెట్టిపేట

అంబేద్కర్ మండల యువజన సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం రమాబాయి అంబేద్కర్ 127వ జయంతి వేడుకలు పట్టణంలోని అంబేద్కర్ విజ్ఞాన మందిరంలో నిర్వహించారు. ఆమె చిత్ర పటానికి పూల మాల వేసి వందనం చేశారు. అనంతరం సంఘం అధ్యక్షులు ముల్కల రాందాస్ మాట్లాడుతూ అంబేద్కర్ సతీమణి రమాబాయి జీవితం ప్రతి మహిళకు ఆదర్శమన్నారు. అంబేద్కర్ అమెరికాలో చదువుకునే రోజుల్లో ఎన్నోసార్లు డబ్బులు సరిపోక రమాబాయి వివిధ రకాల పనులు చేసి, కొన్నిసార్లు పస్తులు ఉండి కూడా అవసరమైన డబ్బులు సర్దుబాటు చేసిందని గుర్తు చేసుకున్నారు. సాధారణ అంబేద్కర్ నుంచి డాక్టర్ అంబేద్కర్‌గా మారడానికి రమాబాయి అంబేద్కర్ త్యాగమే కారణమన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి భైరం రవి, జిల్లా నాయకులు చాతరాజు రాజన్న, ధర్మన్న, నారాయణ, బీసీజేఏసీ నాయకులు హనుమండ్ల శంకర్, మాజీ మండలాధ్యక్షుడు నర్సయ్య, నాయకులు పెండెం సత్తన్న, చుంచు రమేష్, కిషన్, జనార్దన్, దేవేందర్, శ్రీధర్, మహేందర్, బానేష్ పాల్గొన్నారు.

ఏడీకి బీసీ సంఘం సన్మానం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి ఏడీగా ఉద్యోగోన్నతిపై వచ్చిన ఎస్.వేణుగోపాల్ గౌడ్‌ను బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. శుక్రవారం ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు చిక్కాల దత్తు, కలల శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యారంగ సమస్యలతో పాటు బీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. అన్ని రకాల పాఠశాలలలో చదువుతున్న బీసీ విద్యార్థులకు అన్ని రకాల సదుపాయాలు కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు నర్సాగౌడ్, అధికార ప్రతినిధి కాసర్ల శ్రీనివాస్, ఉపాధ్యక్షులు మేకల అశోక్, సత్యనారాయణ, సెక్టోరియల్ అధికారి జెట్టి నారాయణ, డీఈఓ కార్యాలయ సీసీ రాజేశ్వర్, జూనియర్ అసిస్టెంట్ సతీష్ పాల్గొన్నారు.

బీసీలపై రాజకీయ పార్టీల సవతితల్లి ప్రేమ

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల్లో ఉన్న బీసీ కుటుంబాలపై అన్ని రాజకీయ పార్టీలు సవతితల్లి ప్రేమను చూపిస్తున్నాయని నిర్మల్ జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎంబడి చంద్రశేఖర్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన బీసీ కుటుంబాల వారికి ఏ రాజకీయ పార్టీ కూడా ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రకటించలేదని బీసీ ప్రజలపై రాజకీయ పార్టీలు వ్యవహరిస్తున్న తీరుపై ఆయన మండిపడ్డారు. రాబోయే రోజుల్లో బీసీల సత్తా అంటే ఏంటో రాజకీయ పార్టీలకు చూపిస్తామని హెచ్చరించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-లక్షెట్టిపేట

మండలంలోని వెంకట్రావుపేట్ 33/11 కెవి సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా శనివారం ఉదయం 10 గంటల నుండి 12 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ గణేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వెంకటరావుపేట్, కొత్త కొమ్ముగూడెం, పాత కొమ్ముగూడెం, దౌడపల్లి, తలమల, చెల్లంపేట్, ఎల్లారం, కొత్తూరు, చంధారం, రంగపేట్, హనుమంతుపల్లి గ్రామాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

హాజీపూర్ : హాజీపూర్ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ మహేందర్‌రెడ్డి తెలిపారు. హాజీపూర్, టీకనపల్లి, దొనబండ, పెద్దంపేట, బుద్ధిపల్లి, కొండపూర్, కరణమామిడి, పడ్తనపల్లి, కొండపల్లి, రాంపూర్ గ్రామాల్లో ఉదయం 10 గంటల నుండి 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

ఆదిలాబాద్‌టౌన్ : పట్టణంలోని భుక్తాపూర్ సబ్ స్టేషన్ పరిధిలో లైన్‌ల మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ఏఈ సదానందం శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీనివల్ల విద్యానగర్, భుక్తాపూర్, ద్వారకానగర్, సినిమా రోడ్, మొచిగల్లి, రాణీసతిజీ కాలనీ ఏరియాలలో విద్యుత్తు అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. ఈ అంతరాయానికి విద్యుత్ వినియోగదారులందరు సహకరించాలని కోరారు.

నిర్మల్‌రూరల్ : మామడ మండలంలోని దిమ్మదుర్తి, పొన్కల్, కమల్ కోట్, అనంతపేట్, నల్దుర్తి, చింతల్ చాంద గ్రామాలకు శనివారం అనగా ఫిబ్రవరి 8న ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నెలవారి మరమ్మత్తుల కారణంగా 33 కేవీ దిమ్మదుర్తి ఫీడర్ పైన చెట్ల కొమ్మలను తొలగించుటకు, విద్యుత్ లైన్‌లో మార్పులు, మరమ్మత్తులు చేయుటకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని, విద్యుత్‌శాఖాధికారి బాలయ్య తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

రూ.81వేల నగదు పట్టివేత

నవతెలంగాణ-కుభీర్

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో సిరిపెల్లి చెక్‌పోస్టు వద్ద రూ.81వేల నగదు పట్టుబడింది. మహారాష్ట్రలోని కిని గ్రామం నుంచి కుభీర్ వైపుకు వస్తుండగా నర్సింహారెడ్డి వద్ద నగదు స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ రవీందర్ తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి పత్రాలు లేకుండా నగదు, మద్యం సరఫరా చేస్తే కేసులు నమోదు చేస్తామని పేర్కొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవాలి

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్

నవతెలంగాణ-నస్పూర్

మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్-కరీంనగర్ నియోజకవర్గాల ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికలలో భాగంగా 27న జిల్లాలో జరగనున్న పోలింగ్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ప్రైవేట్ సంస్థలు, వ్యాపారం, పరిశ్రమలు, ట్రేడ్ ఇతర సంస్థలలో పని చేస్తున్న అర్హత గల ఓటర్లు తమ ఓటు హక్కు తప్పనిసరిగా వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 27న ఉదయం 8గంటల నుండి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ జరుగుతుందన్నారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రభుత్వ ఉద్యోగులకు పోలింగ్ రోజు సెలవు దినంగా ప్రకటించడం జరిగిందని, ప్రైవేట్ సంస్థలలో పని చేసే ఉద్యోగులు, అధికారులకు ఓటు హక్కు వినియోగించుకునేందుకు వీలుగా విధులలో వెసులుబాటు కల్పించడం జరుగుతుందని తెలిపారు. యాజమాన్యాలు ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం సహకరించాలని తెలిపారు.

అజ్ఞాతం వీడి జనజీవనంలోకి రావాలి



నవతెలంగాణ-ఖానాపూర్

అజ్ఞాతం వీడి జనజీవనంలోకి తిరిగి రావాలని ఎస్పీ జానకి షర్మిల అన్నారు. శుక్రవారం పోరు కన్న ఊరు మిన్న, మన ఊరుకు తరలిరండి కార్యక్రమంలో భాగంగా ఖానాపూర్ మండలంలోని భావాపూర్(ఆర్) గ్రామానికి చెందిన తుమ్ శ్రీనివాస్ ఇంటికి వెళ్లి నిత్యావసర సరుకులు వారికి అందజేసి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శ్రీనివాస్ తల్లి లచ్చవ్వ తన చివరి దశలో తన కుమారుని తన దగ్గర ఉండాలని కోరుకుంటుందని అన్నారు. తన కర్మకాండ సైతం తన కుమారుడే చేయాలని లచ్చవ్వ తనతో బోరున విలపించిందని అన్నారు. శ్రీనివాస్ తన కన్నతల్లి లచ్చవ్వ ఆవేదనను అర్థం చేసుకొని తిరిగి ప్రజా జీవనంలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రాజేష్ మీనా, సీఐ సైదారావు, పెంబి ఎస్సై హనుమాన్లు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

చివరి దశలో చూడాలని ఉంది బిడ్డా.. వచ్చి లొంగిపో రా..

చివరి దశలో ఒక్కసారైనా నిన్ను చూడాలని ఉంది బిడ్డా వచ్చి లొంగిపోరా అని ఓ వృద్ధతల్లి తన కొడుకు కోసం విలపిస్తుంది. చివరి దశలో తన దగ్గర తన కుమారుడు ఉండాలని తన కర్మకాండ తన కుమారుడే చేయాలని కన్నీటి పర్యంతమైంది. వివరాలు ఇలా ఉన్నాయి. ఖానాపూర్ మండలంలోని బావాపూర్ (ఆర్) గ్రామానికి చెందిన తుమ్ శ్రీనివాస్(14) సంవత్సరాల వయసులో నిజామాబాద్ జిల్లాలోని మోస్రా స్కూలుకు వెళ్తానని చెప్పి వెళ్లాడని దాదాపు 40 సంవత్సరాలు అవుతున్న ఇప్పటివరకు తనను చూడడానికి ఒక్కసారి కూడా రాలేదని వాపోయింది. ఈ ఆఖరి దశలోనైనా తనతో తన కుమారుడు ఉండాలని విలపించింది. వృద్ధురాలు తన కుమారుడు తన దగ్గరకు రావాలని విలపించిన తీరు పలువురికి కంటతడి పెట్టించింది.

మాజీ కేంద్ర మంత్రి అనంత రాములు వర్ధంతి



నవతెలంగాణ-ఖానాపూర్

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ పీసీసీ ప్రెసిడెంట్ నాగర్‌కర్నూల్, మాజీ కేంద్ర మంత్రి స్వర్గీయ మల్లు అనంత రాములు 35వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం ఖానాపూర్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్‌లో నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాహుల్ గాంధీ ఫాలోవర్స్ ఫ్రంట్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు శనిగారపు కమలాకర్ కాంగ్రెస్ ఖానాపూర్ మండలాధ్యక్షులు దొనికేని దయానంద్, మున్సిపాలిటీ మాజీ చైర్మెన్ చిన్నం సత్యం ఖానాపూర్ కాంగ్రెస్ టౌన్ ప్రెసిడెంట్, ఖానాపూర్ మండల మాజీ వైస్ ఎంపీపీ తోట సత్యం, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు బానోత్ గోవింద్, రాసమల్ల అశోక్, నబీ ఖాన్, చొప్పదండి రాజేష్ కుమార్, వేల్పుల రమేష్, మామిడిపల్లి బెన్ని పాల్గొన్నారు.

అనారోగ్యంతో మాజీ సర్పంచ్ మృతి



నవతెలంగాణ-బోథ్

సొనాల మండలంలోని సాకెర గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ ధరావత్ మీరాబాయి అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. గత కొన్ని రోజుల నుంచి కిడ్నీ వ్యాధితో బాధపడుతూ శుక్రవారం మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ...

సొనాల మండలంలోని సాకెర గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ ధరావత్ మీరాబాయి మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్ శుక్రవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఆయన వెంట నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా రమాబాయి జయంతి

నవతెలంగాణ-వాంకిడి

మండల కేంద్రంలోని జైత్వాన్ బుద్ధ విహార్‌లో రమాబాయి 127వ జయంతి వేడుకలను అంబేద్కర్ సంఘం నాయకులు, మాతృశ్రీ రమాబాయి మహిళా మండలి నాయకులు శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. మండలంలోని కమాన, ఇందానీ, సరండి, కన్నర్‌గావ్ గ్రామాల్లో జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం నాయకులు జయరాం, విజయ్, విలాస్, మహిళా మండలి నాయకులు పాల్గొన్నారు.